భారత

కమ్యూనిస్టు పార్టీ

(మార్క్సిస్టు)

# రాజకీయ పరిణామాలపై నివేదిక

(2020 జులై 25-26 తేదీల్లో జరిగిన

కేంద్రకమిటీ సమావేశంలో ఆమోదించబడింది)

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

# రాజకీయ పరిణామాలపై నివేదిక

(2020 జులై 25–26 తేదీల్లో జరిగిన
సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సమావేశంలో ఆమోదించబడింది)

కోవిడ్–19 మహమ్మారి, లాక్‌డౌన్‌లు సృష్టించిన పరిస్థితుల వల్ల మన కేంద్ర కమిటీ సమావేశం ఆరు మాసాల తరువాత జరుగుతోంది. ఇది అసాధారణమైనది. కానీ నేటి పరిస్థితులు, అనిశ్చితిలో దీనికి మించి మరో మార్గం లేదు. ప్రయాణాలపై నిషేధాలు, కరోనా మహమ్మారి నుండి జాగ్రత్తల దృష్ట్యా ఈ సమావేశం కూడా డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించుకుని ఆన్‌లైన్‌లో జరుపుకుంటున్నాం. కోవిడ్–19కు వ్యాక్సిన్ వచ్చేంతవరకు, లేక కరోనాకు సరైన మందు కనుగొనబడేంతవరకు ఈ రకమైన అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతాయి. మన కామ్రేడ్స్ అంతా, ముఖ్యంగా 60 ఏళ్లు దాటిన వారంతా భౌతిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం, ఇతర వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం చాలా అవసరం.

ఈ కాలంలో మన పార్టీ... కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీల స్థాయినుండి కింది కమిటీల వరకు ప్రజలతో సంబంధాలు కొనసాగించడానికి వివిధ కార్యక్రమాల ద్వారా అనేక ప్రజాసమస్యలపై పనిచేసింది. ప్రజల తక్షణ సమస్యలపై పనిచేసింది. బాధల్లో ఉన్న ప్రజలకు సహాయం అందించడం కోసం గొప్ప కృషి చేసింది. పార్టీ కేంద్రం, రాష్ట్ర కమిటీల నివేదికలను సిసి సభ్యులందరికీ ఇవ్వడం జరిగింది. అందువల్ల ఆ వివరాలు ఇక్కడ మళ్లీ పేర్కొనడం లేదు.

# అంతర్జాతీయ పరిణామాలు

## కోవిడ్-19 మహమ్మారి

భూగోళమంతటా మహమ్మారి వ్యాపిస్తుండడంతో ప్రపంచం చాలా క్లిష్టమైన పరిస్థితుల్లోకి వెళ్లింది. జులై 12 నాటికి 1.3 కోట్ల మంది ప్రజలకు మహమ్మారి సోకింది. దాదాపు ఆరు లక్షల మంది చనిపోయారు. అమెరికాలోనే 1.4 లక్షల మంది చనిపోయారు. (ఈ సంఖ్యలు పెరుతూనే ఉన్నాయి. వాటిని ఎప్పటికప్పుడు తాజాపరచాలి). ప్రజలు మహమ్మారి బారిన పడిన దేశాల్లో అమెరికా మొదటి స్థానంలో ఉండగా, బ్రెజిల్ రెండో స్థానంలో, భారత్ మూడో స్థానంలో నిలిచాయి.

దాదాపు అన్ని దేశాలూ ఆయా దేశాల్లో మహమ్మారి విజృంభణను దృష్టిలో పెట్టుకుని వివిధ స్థాయిల్లో లాక్‌డౌన్‌లు విధించాయి. కొన్ని దేశాల్లో లాక్‌డౌన్ పరిస్థితులు నెలల పర్యంతం సాగాయి. మహమ్మారి, లాక్‌డౌన్‌లు కలిసి ప్రపంచ వ్యాపితంగా ప్రజల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ జీవితాలను తీవ్రంగా ఆటంకపరిచాయి.

అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో మరణాలు సాపేక్షంగా ఎక్కువగా ఉన్నాయి. ఇందులో ఆశ్చర్యపోవాల్సిన విషయం లేదు. ఈ దేశాల్లో నయా - ఉదారవాదాన్ని తీవ్రంగా అమలు పరచడం వల్ల అత్యవసర సర్వీసులు, ముఖ్యంగా ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ పెద్ద ఎత్తున ప్రయివేటీకరించబడింది. మహమ్మారులు - అంటువ్యాధుల నుండి ప్రజలను రక్షించే పరిశోధనలపై ప్రభుత్వాలు దాదాపు ఖర్చుచేయడం ఆపేయడం వల్ల ప్రపంచం ఇటువంటి అంటు రోగాల బారిన పడుతోంది. అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి నాయకత్వంలోని నయా - ఉదారవాదానికి ఎట్టి పరిస్థితుల్లోనూ గరిష్ట లాభాలు గడించడమే పరమావధిగా మారిపోవడం వల్ల పెద్ద సంఖ్యలో ప్రజలకు మౌలిక ఆరోగ్య సదుపాయాలు అందకుండా పోతున్నాయి. అందువల్ల ప్రజారోగ్య వ్యవస్థ ప్రయివేటు బీమా కంపెనీల, బాడా ఫార్మా కార్పొరేట్ల దయాదాక్షిణ్యాలకు వదిలిపెట్టేయడం జరుగుతోంది. కరోనా వైరస్‌కు పేదా ధనికా తేడాలు లేవు. అయినా నయా-ఉదారవాదం సృష్టించిన తీవ్రమైన ఆర్థిక అసమానతలు పెద్ద ఎత్తున ప్రజలను మహమ్మారి బారిన పడేస్తున్నాయి. అందువల్ల పెట్టుబడిదారీ వ్యవస్థ కింద మహమ్మారి తీవ్రంగా ప్రబలే పరిస్థితులు ఏర్పడ్డాయి.

మహమ్మారి ప్రపంచమంతటా ప్రమాదకరంగా మారుతోందనీ, “కనుచూపు మేర కాలంలో పరిస్థితులు పూర్వస్థితికి వచ్చే అవకాశం లేదనీ” ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ (జులై12న) హెచ్చరించారు. “చాలా దేశాలు తప్పుడు మార్గంలో వెళుతున్నాయి” అని ఆయన దేశాల పేర్లు చెప్పకుండా కొన్ని ఐరోపా, ఆసియా దేశాలను దృష్టిపెట్టుకుని పేర్కొన్నారు. “దీన్ని అరికట్టడానికి అతి కీలకమైన అంశం: నమ్మకం. దాన్ని ఈ దేశాలు వమ్ముచేస్తున్నాయి” అని ఆయన పేర్కొన్నారు. ఆయన చాలా స్పష్టంగా మితవాద నిరంకుశ ప్రభుత్వాలను ఉద్దేశించి ఈ మాటలు చెప్పారు. ఆ దేశాలే నేడు కరోనా కేసుల్లో అగ్రస్థానంలో ఉన్నాయి. శాస్త్రీయ సలహాలను తీసుకుని మహమ్మారిని కట్టడిచేయడానికి ప్రయత్నించని దేశాలనుద్దేశించి మాట్లాడుతూ “మౌలిక సూత్రాలను అనుసరించకపోతే ఈ మహమ్మారి పరిస్థితి మరింత, మరింత, మరింత దిగజారిపోతుంది” అని పేర్కొన్నారు.

**సోషలిస్టు దేశాలు :** దీనికి భిన్నంగా అనేక దశాబ్దాలుగా సమర్థవంతమైన సార్వజనీన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను నిర్మించుకున్న సోషలిస్టు దేశాలు ఈ మహమ్మారిని చాలా మెరుగ్గా అరికట్టగలిగాయి. చైనాలోని వూహాన్ నగరంలో మొట్టమొదట వైరస్ కనిపించింది. ఆ దేశం మహమ్మారి వ్యాప్తిని అరికట్టింది. తొలుత ప్రకటించిన లాక్‌డౌన్ ముగిసిన తరువాత చైనా ప్రజలు విదేశాల నుండి పెద్ద ఎత్తున తిరిగి వస్తుండడంతో మహమ్మారి మరోమారు విజృంభించింది. కాని ఎంతో అప్రమత్తతతో ఇటువంటి ప్రదేశాలను గుర్తించి, వేరుచేయండం ద్వారా వైరస్ వ్యాప్తిని అరికట్టగలిగారు. ప్రస్తుతం చైనా తన ఆర్థిక వ్యవస్థనూ, సాధారణ కార్యకలాపాలనూ దశల వారీగా తెరవడం ప్రారంభించింది. చైనాతో సుదీర్ఘమైన భూ సరిహద్దు ఉన్న వియత్నాంలో కోవిడ్-19 వల్ల ఒక్క మరణం కూడా సంభవించలేదు. క్యూబా 100 కన్నా తక్కువ మరణాలతో మహమ్మారిని కట్టడి చేయగలిగింది. అది ఇప్పుడు ప్రపంచంలోని 50కి పైగా దేశాలకు మహమ్మారిని అరికట్టే మందులు, పరికరాలు సరఫరాచేస్తూ సహాయసహకారాలు అందిస్తోంది. లావోస్‌లో కూడా మహమ్మారి వల్ల ఎవరూ మరణించలేదు. ఉత్తర కొరియా ప్రపంచంతో తెగతెంపులు చేసుకుని ఉంటుంది గనుక అక్కడ పాజిటివ్ కేసులే లేవు.

కరోనా మహమ్మారిని అరికట్టడంలో సోషలిస్టు వ్యవస్థ ఆధిక్యత చాలా స్పష్టంగా కనిపిస్తోంది.

మంచి సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలున్న దక్షిణ కొరియా, సింగపూర్,

న్యూజిలాండ్, తైవాన్ వంటి దేశాలు కూడా మహమ్మారిని మరింత సమర్ధవంతంగా కట్టడి చేయగలిగాయి

**కేరళ:** భారత దేశంలో సిపిఐ(ఎం) నాయకత్వంలోని కేరళ వామపక్ష ప్రజాతంత్ర ఫ్రంట్ ప్రభుత్వం మహమ్మారిని కట్టడి చేయడంలో ఆదర్శవంతమైన రికార్డు సృష్టించింది. 'కేరళ నమూనా' అంతర్జాతీయంగా మన్ననలు అందుకున్నది. ఇది అందరూ అనుసరించదగ్గ నమూనా అని ప్రపంచ ఆరోగ్య సంస్థ కొనియాడింది. మహమ్మారిని కట్టడి చేయడానికి నాలుగు వైపుల నుండి చర్యలు తీసుకునే ఈ మార్గం శాస్త్రీయ సలహాల ఆధారంగా రూపొందించబడింది. ఈ నాలుగు చర్యలు: విస్తృతంగా పరీక్షలు నిర్వహించడం, పాజిటివ్ కేసులున్నవారిని వేరుపెట్టడం, వారితో కాంటాక్ట్ అయిన వారిని గుర్తించడం, క్వారంటైన్ చేయడం.

అనేక దేశాలు ముఖ్యంగా మితవాద నయాఉదారవాద దేశాలు తాము మహమ్మారిని ఎదుర్కోడానికి బాగా సిద్ధపడి ఉన్నామని చెప్పుకోడానికి శాస్త్రీయ సూచనలను పెడచెవిని పెట్టాయి. ఫలితంగా పెద్ద ఎత్తున వినాశనం చవిచూశాయి. అందువల్ల మితవాద నిరంకుశ ప్రభుత్వాలున్న అమెరికా, బ్రెజిల్, భారత్ లాంటి దేశాల్లోనే అత్యధిక కరోనా కేసులున్నాయంటే ఆశ్చర్యపోనక్కరలేదు.

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

మహమ్మారికి ముందే మాంద్యంలో ఉన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు మరింత దెబ్బతిన్నది. 2020లో ప్రపంచ జిడిపి - 5.2 శాతం పడిపోతుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. అమెరికా జిడిపి - 6.1 శాతం, యూరో జోన్ - 9.1 శాతం, జపాన్ - 6.1 శాతం పడిపోతుందని అంచనా వేసింది. ఇవన్నీ కూడా ప్రపంచ బ్యాంకు 2020 జనవరిలో వేసిన అంచనాలు. ప్రపంచంలోని అన్ని దేశాలూ మాంద్యాన్ని ఎదుర్కొంటాయని, జి20 దేశాల జిడిపి - 6.4 శాతం పడిపోతుందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ అంచనా వేసింది. ఇతర అంతర్జాతీయ సంస్థల అంచనాలు కూడా సుమారు ఇలాగే ఉన్నాయి. 2020లో ప్రపంచ వాణిజ్యం 30 శాతం పడిపోతుందని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) తెలిపింది. ప్రపంచ ఉత్పత్తి ఈ మేరకు పడిపోవడం వల్ల ప్రజల జీవనోపాధి ప్రమాదకరమైన స్థితికి చేరుతుంది. ఇప్పటికే ప్రపంచ వ్యాపితంగా పేదరికం, నిరుద్యోగం, ఆకలి, దారిద్ర్యం పెరుగుదల రూపంలో దీని ప్రభావం కనిపిస్తోంది.

## పెరుగుతున్న పేదరికం

ఈ ఏడాది 3.5 కోట్ల మంది ప్రజలు ముఖ్యంగా అసంఘటిత రంగంలో ఉన్న వారు అదనంగా నిష్టదారిద్ర్యంలోకి దిగజారిపోతారని ఐక్య రాజ్య సమితి అంచనా వేసింది. ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారం ఈ సంఖ్య 6 కోట్లకు పెరగవచ్చు. సుదీర్ఘ లాక్‌డౌన్‌లు, విద్యా సంస్థల మూత వల్ల 120 దేశాల్లో 125 కోట్ల మంది పిల్లలు, యువకుల మీద ప్రతికూల ప్రభావం ఉంటుంది.

అదనంగా మరో 26.5 లక్షల మంది ప్రజలు ఆకలి సంక్షోభంలోకి నెట్టబడతారని ప్రపంచ ఆహార కార్యక్రమం అంచనా వేసింది.

## నిరుద్యోగం

కరోనా మహమ్మారి, లాక్‌డౌన్‌ల వల్ల ప్రపంచంలో పనిచేస్తున్న వారిలో సగం మంది ఉద్యోగాలు కోల్పోతారని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) అంచనా వేసింది. ప్రపంచ వ్యాపితంగా 15.8 కోట్ల నుండి 24.2 కోట్ల ఉద్యోగాలు పోతాయని ఆసియా అభివృద్ధి బ్యాంకు అంచనా వేసింది. వీటిలో 70 శాతం ఆసియా–పసిఫిక్‌లో పోతాయి. ప్రపంచ కార్మికుల ఆదాయాలు 1.2 లక్షల కోట్ల నుండి 1.8 లక్షల కోట్ల డాలర్ల మధ్య పడిపోతాయి. ఐఎల్‌ఓ అంచనా ప్రకారం అసంఘటిత రంగ కార్మికులు పెద్ద ఎత్తున నష్టపోతారు. ఇప్పటికే ఈ రంగంలో ప్రపంచ వ్యాపితంగా 160 కోట్ల మంది జీవనోపాధి కోల్పోయారని అది తెలిపింది.

## పెరుగుతున్న అసమానతలు

మెజారిటీ ప్రజానీకపు ఈతిబాధలు ఇలా ఉండగా, ప్రపంచలోని మహా ధనవంతులు 2020 మార్చి, మే నెలల మధ్య మరింత ధనవంతులైనారు. మార్చి 23 నుండి మే 23 మధ్య ప్రపంచంలోని 25 మంది అత్యధిక ధనవంతుల ఆస్తులు మరో 25,500 కోట్ల డాలర్లు పెరిగిపోయాయని ఫోర్బ్స్ పత్రిక అంచనా వేసింది.

## దివాళాతీసిన నయా ఉదారవాదం

మహమ్మారిని ఏకోన్ముఖంగా ఎదుర్కోవడంలోనూ, సమిష్టిగా వ్యాక్సిన్ తయారుచేసి ఆర్థిక ఈతిబాధలు ఎదుర్కొంటున్న ప్రజలకు సహాయం అందించడంలోనూ పెట్టుబడిదారీ వ్యవస్థ అసమర్థత ఏమిటో ప్రపంచవ్యాపితంగా బట్టబయలైంది.

నయాఉదారవాదపు దివాళాకోరుతనాన్నీ, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నాయకత్వంలోని నయా–ఉదారవాద ప్రపంచీకరణ వైఫల్యాన్నీ మన పార్టీ 22వ మహాసభ విశ్లేషించింది. తదనంతరం కేంద్ర కమిటీ సమావేశాల్లో దీని గురించి చెప్పడం జరిగింది. నయా–ఉదారవాదం దేశీయ ద్రవ్య మార్కెట్లను సరళీకరించడం, కార్మిక సంస్కరణల పేరుతో దేశీయ ఉద్యోగాలకు భద్రతలు తొలగించడం, దేశీయ వనరుల, మార్కెట్ల తలుపులు తెరవడం, అంతర్జాతీయ వాణిజ్యం, ద్రవ్య పెట్టుబడులు దేశాల మధ్య ప్రవహించడానికి ఉన్న ఆటంకాలను తొలగించడం...ఇవన్నీ కూడా పెట్టుబడిదారీ సంక్షోభాన్ని ముఖ్యంగా 2008 వాల్ స్ట్రీట్ పతనం తరువాత ఏర్పడిన ప్రపంచ ఆర్థిక మాంద్యాన్ని నిలువరించలేకపోయాయి. అదే విధంగా ప్రజల సంక్షేమాన్ని కూడా కాపాడలేకపోయాయి. మరోవైపు గరిష్ట లాభాల వేటవల్ల దోపిడీ తీవ్ర స్థాయికి వెళ్లి ప్రపంచ గిరాకీ అధఃపాతాళానికి దిగజారింది. ఇది మళ్లీ ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసి, ఆర్థిక అసమానతలను పెంచింది.

**మరింత ఎక్కువ ప్రభుత్వ జోక్యం:** ప్రస్తుత పరిస్థితుల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అయిన స్థితిలో ప్రభుత్వాలు మరింతగా జోక్యం చేసుకోవాలని చాలా మంది, చివరికి నయా–ఉదారవాదాన్ని నెత్తికెత్తుకు పూజించేవారు కూడా కోరుతున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీనీషియన్ ప్రభుత్వ జోక్యం, 1930వ దశకంలో మహా మాంద్యం నుండి బయట పడడానికి అమెరికాలో రూజ్‌వెల్ట్ ప్రవేశపెట్టిన న్యూ డీల్ లను ప్రవేశపెట్టాల్సిన దశ వచ్చిందని ఫైనాన్షియల్ టైమ్స్, లండన్, న్యూయార్క్ టైమ్స్, ఎకనామిస్ట్ మొదలైన ప్రతిష్టాత్మక మీడియా సంస్థలన్నీ చెబుతున్నాయి. బ్రిటిష్ ప్రధాన మంత్రి బోరిస్ జాన్సన్ ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ, తాను కమ్యూనిస్టును కాననీ, అయితే అదే సమయంలో ప్రభుత్వం మరింత ఎక్కువ పెట్టుబడులు పెట్టాలనీ, వైద్యం, విద్య వగైరా నిత్యావసర సేవలను ప్రభుత్వమే అందించాలని పేర్కొన్నారు. ఆర్థిక అంతరాలు తగ్గించడం, కార్మిక హక్కులను పెంపొందించడం..ఇవన్నీ నాయా–ఉదారవాద వ్యవస్థకు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికీ, పెట్టుబడిదారీ వ్యవస్థను రక్షించి దాని అభివృద్ధిని ముందుకు తీసుకుపోడానికీ అవసరమని భావిస్తున్నారు. తన ప్రయోజనం కోసమైనా ఇటువంటి ప్రభుత్వ జోక్యం అవసరం ఉందని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అర్థం చేసుకుంటుందని మరికొందరు భావిస్తున్నారు.

అయితే కీన్స్, రూజ్‌వెల్ట్‌ల ప్రపంచానికీ 2020లోని నయా–ఉదారవాద ప్రపంచానికీ మధ్య చాలా తేడా ఉంది. ప్రభుత్వం నిధులు సమకూర్చడం ద్వారా జోక్యం చేసుకోడాన్ని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి తన లక్షణం రీత్యానే అంగీకరించదు. అలా చేస్తే ద్రవ్య లోటు పెరిగిపోతుందనీ, ప్రభుత్వ పెట్టుబడుల ద్వారా పెట్టుబడి బంధీ అయిపోయి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడులకు లాభాలు రాకుండా పోతాయని అది భావిస్తుంది. ఇటువంటి నివారణా చర్యలను నయా – ఉదారవాద వ్యవస్థ ప్రతిఘటిస్తుంది. పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాలని, తనకు గరిష్ట లాభాలు వచ్చేందుకు ప్రపంచ గిరాకీ పెరగాలనీ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి కోరుకుంటుంది. అయితే ఇది ప్రభుత్వ జోక్యం ద్వారా జరగ కూడదనీ, ప్రయివేటు పెట్టుబడికి మరిన్ని నిధులను సమకూర్చడం ద్వారా ప్రయివేటు పెట్టుబడే ఆ పనిచేసే విధంగా ప్రభుత్వాలు సహాయ పాత్ర నిర్వహించాలనీ కోరుకుంటుంది.

ఈ పద్ధతినే దాదాపు అన్ని పెట్టుబడిదారీ దేశాలు అనుసరిస్తున్నాయి. ఆయా ప్రభుత్వాలు ప్రకటించే ద్రవ్య–ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీల్లో పెద్ద భాగాన్ని, ప్రజలకు నేరుగా బదిలీ చయడానికో లేక మరింత ఉపాధినీ, గిరాకీనీ పెంచే ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టేందుకో కాకుండా, ప్రయివేటు పెట్టుబడికి లోన్లు ఇవ్వడానికి కేటాయిస్తున్నారు.

నయా–ఉదారవాద వ్యాధినివారణ చర్యల దివాళాకోరుతనం మరోసారి విస్పష్టంగా బయపడిపోయింది. ప్రజల వద్ద కొనుగోలు శక్తి లేనప్పుడు, తను ఉత్పత్తి చేసే సరుకును ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితులున్నప్పుడు ఏ ప్రయివేటు సంస్థ కూడా అప్పుతీసుకు వచ్చి పెట్టుబడి పెట్టి ఉత్పత్తి చేయదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి అమ్ముడు కాకపోతే లాభాలు రావు. అందువల్లనే, 'పొదుపు చర్యలు' అనే పేరుతో శ్రామిక ప్రజల ఆదాయాలకు కోత పెట్టడం, ఉద్యోగాలు ఊడగొట్టడం, సాంఘిక సంక్షేమ ఖర్చుల్లో తీవ్రంగా కోత విధించడం వంటి వాటిని పెంచి, వారిని తీవ్రంగా దోపిడీ చేయడం ద్వారా లాభాలు పెంచుకునే విష వలయంలోకి వెళ్లిపోవడం జరుగుతోంది.

దీనివల్ల ప్రపంచ వ్యాపితంగానూ, ఆయా దేశాల్లోనూ వర్గ పోరాటాలు తీవ్రతరం అయ్యే అవకాశాలు ముందుకొస్తున్నాయి.

## ప్రజాందోళనలు

మహమ్మారి, లాక్‌డౌన్ కాలంలో కూడా అనేక దేశాల్లో పెట్టుబడిదారీ దోపిడీకి, పనిపరిస్థితులు, జీవనపరిస్థితుల మీద జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా కార్మిక వర్గ నిరసన పోరాటాలు జరిగాయి. అమెరికా, ఇటలీ, స్పెయిన్, బ్రిటన్, గ్రీస్, జపాన్, చిలీ, బ్రెజిల్, లెబనాన్ ఇంకా అనేక దేశాల్లో కార్మికుల వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. నిషేధాలు ఉన్నప్పటికీ అనేక దేశాల్లో మేడే పెద్ద ఎత్తున నిర్వహించారు. కొన్ని దేశాల్లో సమ్మెలు జరిపారు. ఈ నిరసనలన్నీ కోవిడ్ నిబంధనలను అనుసరించే జరిగాయి. ఆన్‌లైన్ నిరసనలు, భౌతిక దూరం పాటిస్తూ, మాస్కులు ధరిస్తూ వీధుల్లో నిరసనలు వంటి కొత్త ఆందోళనా రూపాలు ముందుకొచ్చాయి.

## రాజకీయ మితవాదం వైపు మొగ్గు

ఈ పరిస్థితుల్లో నయా–ఉదారవాదాన్ని రుద్దడం అనేది రాజకీయంగా మరింతగా మితవాద మొగ్గు తీసుకోవడానికి దారితీస్తోంది. మన 2019 అక్టోబర్, 2020 జనవరి కేంద్ర కమిటీ నివేదికల్లో రాజకీయ పరిణామాలపై ఈ విధంగా చెప్పాం: "ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో సుదీర్ఘ సంక్షోభం వల్ల ప్రపంచ వ్యాపితంగా రాజకీయ మితవాదం వైపు మొగ్గు ఏర్పడుతున్నదని 22వ పార్టీ మహాసభ పేర్కొంది. ప్రపంచ వ్యాపితంగా కోట్లాది మంది ప్రజల జీవితాలను నాశనం చేస్తున్న నయా–ఉదారవాద విధానాలకూ, లాభాల గరిష్టీకరణ, తీవ్రమవుతున్న దోపిడికీ వ్యతిరేకంగా జరుగుతన్న ఈ నిరసనలు, దివాళా ఎత్తిన నయాఉదారవాద వ్యవస్థకు ప్రమాదకరంగా మారే దశకు చేరకూడదు. అలా చేరకూడదంటే నిరసనలను విచ్ఛిన్నం చేయాలి. లాభాల గరిష్టీకరణ నెమ్మదించడం వల్ల ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రయోజనాలు దెబ్బ తింటాయి. ప్రపంచ వ్యాపితంగా కార్మిక వర్గ నాయకత్వంలో శ్రామిక ప్రజల ఐక్య నిరసనలను విచ్ఛిన్నం చేయడం కోసమే భావోద్వేగాలను రెచ్చగొట్టడం, వర్ణవివక్ష, విదేశీయులపట్ల వ్యతిరేకత, విద్వేషాలను పెంచడం, ప్రజాతంత్ర హక్కును, పౌరహక్కులను అణచివేయడం వంటి విచ్ఛిన్నకర చర్యలను ముందుకు తెస్తున్నారు." (2019 అక్టోబర్)

అనేక దేశాల్లో కొనసాగుతున్న ఈ రాజకీయ మితవాద మొగ్గు భారత దేశం మీద కూడా ప్రభావం చూపింది. అయితే అనేక దేశాల్లో దీనికి ప్రతిఘటన కూడా ఎదురవుతోంది. కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల మధ్య అంతర్జాతీయ సౌహార్ద్రత ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రతిఘటనను మరింత బలోపేతం చేయాలి." (జనవరి 2020)

ఈ ధోరణి ప్రపంచవ్యాపితంగా మరింత తీవ్రమవుతోంది. ప్రజలను భావోద్వేగాలతో రెచ్చగొట్టడానికి, పెరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా ఆయా దేశాల్లో వారి మధ్య ఏర్పడుతున్న ఐక్యతను చెదరగొట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అమెరికాలోలాగా వర్ణవిభేదాలు రెచ్చగొట్టడం, భారత దేశంలో లాగా మతవిద్వేషాలు రెచ్చగొట్టడం వంటి చర్యల ద్వారా ఈ పని చేస్తున్నారు. టర్కీలో ఎర్డొగాన్ ప్రభుత్వం సరికొత్తగా హగియా సోఫియా మ్యూజియంను ఇస్లామిక్ ప్రార్థనా స్థలంగా ప్రకటించడం కూడా ఇలాంటి చర్యల్లో భాగమే. బ్రెజిల్‌లో బోల్సనారో ప్రభుత్వం కరోనా మహమ్మారిని అరికట్టే బాధ్యతల నుండి తప్పుకుని ప్రజలపై నిరంకుశ చర్యలకు దిగింది. ఇప్పటికే పచ్చి నిరంకుశ ప్రభుత్వాలుండి, ఫాసిస్టు పద్ధతులు అమలు చేస్తూ, శ్రామిక ప్రజలపై తీవ్రమైన దోపిడీ సాగిస్తూ మరోవైపు దివాళాకోరు నయా–ఉదారవాద వ్యవస్థ ప్రయోజనాలు రక్షిస్తున్న దేశాల్లో ఈ ప్రయత్నాలు మరింత తీవ్రంగా జరుగుతున్నాయి.

ఇటువంటి మితవాద మొగ్గువల్ల కూడా పెట్టుబడిదారీ వ్యవస్థలో ఏర్పడిన వ్యవస్థాగత సంక్షోభాన్ని అదిగమించలేరు. పెట్టుబడిదారీ వ్యవస్థ లోపల ఈ సంక్షోభానికి పరిష్కారం లేదన్నది స్పష్టం. రానురాను మరింత ఎక్కువగా ప్రజారాశులను సమీకరించడం ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయాన్ని, అంటే సోషలిజాన్ని బలోపేతం చేయాలి. మనం ఇటువంటి ప్రత్యామ్నాయం గురించి 20వ పార్టీ మహాసభ సైద్ధాంతిక తీర్మానంలోనూ, 22వ పార్టీ మహాసభ రాజకీయ తీర్మానంలోనూ విపులంగా చర్చించుకున్నాం. అటువంటి ప్రత్యామ్నాయం ఏర్పడ్డం అనేది అన్ని దేశాల్లోనూ లెనినిస్టు "వైయక్తిక కారకాల" (సబ్జెక్టివ్ ఫ్యాక్టర్స్)ను బలోపేతం గావించడం మీద ఆధారపడి ఉంటుంది.

## తీవ్రమవుతున్న అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్య యత్నాలు

ప్రస్తుత పరిస్థితుల్లో కరోనా మహమ్మారిని ఎదుర్కోవాలన్నా, తీవ్రమవుతున్న కోట్లాదిమంది ప్రజల ఈతిబాధలను నివారించాలన్నా అంతర్జాతీయ సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉంది. అయితే దీనికి విరుద్ధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్నారు. రానున్న అధ్యక్ష ఎన్నికల్లో గెలవడం కోసమైతేనేమి, అదే సమయంలో కోవిడ్ అనంతర ప్రపంచంలో మరింత బలంపుంజుకుని ప్రపంచం మీద తన అధిపత్య లక్ష్యాలను మరింత ముందుకు తీసుకుపోడానికైతేనేమీ ఆయన అంతర్జాతీయ సహకారాన్ని పెంచడానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు.

అతి త్వరగా వ్యాక్సిన్ అభివృద్ధి చేసేందుకు ప్రపంచ వ్యాపిత శాస్త్రీయ సహకారాన్ని పెంపొందించే బదులు ఆయన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) నుండి అమెరికాను ఉపసంహరించారు. డబ్ల్యుహెచ్ఓ అనేది ఐక్య రాజ్య సమితి కింద పనిచేసే ప్రధానమైన ప్రపంచ ఆరోగ్య సంస్థ. అది చైనా తప్పులను కప్పిపుచ్చుతోందన్న సాకు చూపించి ఆయన తన చర్యను సమర్థించుకున్నారు. కరోనా వైరస్ విస్తరించకుండా చైనా తీసుకున్న చర్యలనూ, దాన్ని కట్టడి చేయడంలో అది చేసిన కృషినీ ఈ ట్రంపుగారే మొదట్లో ప్రసంశించారు. ఇప్పుడు ఆయనే మహమ్మారికి చైనా కారణమని నిందిస్తున్నారు. కరోనా మహమ్మారి పుట్టడానికి దారితీసిన పరిస్థితులపై డబ్ల్యుహెచ్ఓ దర్యాప్తు చేస్తే మాకు పోయేదేమీ లేదని చైనా చెప్పినప్పటికీ ట్రంప్ ప్రపంచ ఆరోగ్య సంస్థ నుండి ఉపసంహరించుకున్నారు.

కరోనా మహమ్మారికి వ్యాక్సిన్ కనుగొంటే దాన్ని మేధో సంపత్తి హక్కుల బాదరబందీలు లేకుండా ప్రజలందరికీ అందజేయడానికి అంతర్జాతీయ సహకారం అందించుకోవాలన్న సూత్రాన్ని ట్రంప్, ఆయనకు సన్నిహితమైన బ్రిటన్‌లోని టోరీ ప్రభుత్వం వ్యతిరేకించాయి. ఆ విధంగా ప్రయివేటు ఫార్మాస్యూటికల్ కంపెనీలు విపరీతమైన ధరలు నిర్ణయించడంలో అమెరికా పాత్రదారి అయింది. వ్యాక్సిన్‌కు అంత ఎక్కువ ధరలు నిర్ణయిస్తే ప్రపంచంలో కోట్లాది మంది ప్రజలకు అది అందుబాటులో లేకుండా పోతుంది. దానికి తోడు కరోనా చికిత్సకు ఎంతో కొంత ఉపయోగపడే మందులన్నిటినీ ట్రంప్ ప్రభుత్వం కొనుగోలు చేసి నిల్వ పెట్టుకుంది. దాంతో ప్రపంచంలోని ఇతరులకు అవి అందుబాటులో లేకుండా పోయాయి. ఆయన ఇటీవల ప్రపంచంలో ఉత్పత్తి అయిన 'రెమ్డెసివిర్' మందు అంతటినీ కొనుగోలు చేశారు. అయితే కరోనాను అరికట్టడంలో వైఫల్యాలు, రోజురోజుకూ అది మరింత విస్తరిస్తుండడంతో డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో అమెరికా ప్రతిష్ట ప్రపంచంలో బాగా దిగజారిపోయింది.

మిన్నెపోలిస్ పోలీసులు జార్జి ఫ్లోయిడ్‌ను కిరాతకంగా హత్య చేయడంతో అమెరికా ప్రతిష్ట మరింత మంటగలిసింది. ట్రంప్ నేతృత్వంలోని అమెరికాలో జాతివవక్షత, హింస ఎలా పెరిగిపోయాయో ఈ ఘటన తెలియజేస్తోంది. "నల్ల జాతి ప్రాణాలు విలువైనవే" (బిఎల్ఎం) అనే నినాదంతో అమెరికాలోనే కాకుండా ప్రపంచ వ్యాపితంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. వలసవాదమే జాతి వివక్షకు ప్రధాన కారణమన్న చారిత్రక సందర్భాన్ని ఈ నిరసనలు ముందుకు తెచ్చాయి. ఐక్య రాజ్య

సమితి, అమెరికా రాజ్యాంగం ప్రకటించిన సార్వత్రిక హక్కుల తీర్మానాలను కాపాడ్డం ద్వారా ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సింది పోయి, ట్రంప్ ప్రజలను జాతుల వారీగా చీల్చడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలా ప్రజలను విభజించడం ద్వారా రానున్న ఎన్నికల్లో ప్రయోజనం పొందాలనుకుంటున్నారు. "నల్లజాతి ప్రాణాలు విలువైనవే" అన్న నినాదానికి పోటీగా ఆయన "తెల్లజాతి శక్తి" అనే నినాదాన్ని ముందుకు తెచ్చారు. ఇది జాతివివక్షతో కూడిన హింసను ప్రేరించే వారిని శిక్షించడంలో అసక్తత ప్రదర్శించడమే కాదు, అటువంటి జాతివిద్వేషాన్ని ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయోగించుకో జూడడమే అవుతుంది.

**'చైనాను కట్టడిచేయడం':** 2020వ సంవత్సరం రెండవ త్రైమాసికంలో చైనా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందిందని బ్లూమ్‌బెర్గ్ తెలిపింది. 2019 రెండవ త్రైమాసికంతో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో చైనా జిడిపి 3.2 శాతం పెరిగింది. 2020 తొలి త్రైమాసికంలో దాని జిడిపి పెద్ద ఎత్తున -6.8 శాతం పడిపోయింది. కోవిడ్‌ను అరికట్టడం కోసం తొలి త్రైమాసికంలో ఆర్థిక వ్యవస్థను మూసేసిన చైనా తరువాతి కాలంలో మహమ్మారిని కట్టడి చేయగలిగింది. అయితే ఇప్పటికీ 2019 తొలి ఆరుమాసాలతో పోలిస్తే ఈ ఏడాది తొలి ఆరుమాసాల్లో ఆర్థిక వ్యవస్థ 1.6 శాతం తక్కువగా నమోదయింది. దేశీయ గిరాకీ బలహీనంగా ఉంది. దాన్ని పరిష్కరించాల్సి ఉంది. 2020 నాటికి దేశంలో పేదరికాన్ని నిర్మూలించాలనీ, అన్ని విధాలా ఒకమాదిరి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనీ పెట్టుకున్న లక్ష్యాలను నెరవేర్చడం జరుగుతుందని చైనా ప్రభుత్వం జాతీయ పీపుల్స్ కాంగ్రెస్‌కు (పార్లమెంటుకు) తెలిపింది. దేశంలో 90 లక్షల కొత్త పట్టణ ఉద్యోగాలు సృష్టించబడతాయనీ, దాదాపు 30 కోట్ల మంది వృద్ధులకు పెన్షన్ నిధులు సమకూర్చుతారనీ, 140 కోట్ల మంది చైనా ప్రజలకు అవసరమైన ఆహారం సమకూర్చడంతోపాటు వారి ఆదాయాలను మరింత పెంచుతారని భావిస్తున్నారు. చైనా ఆర్థిక వ్యవస్థ ఆ విధంగా మెరుగుపడడం కోవిడ్ అనంతర ప్రపంచంలో అమెరికా ప్రపంచాధిపత్యానికి సవాలు కానుంది.

అమెరికా సామ్రాజ్యవాదం ఈ పరిణామాన్ని కోవిడ్ అనంతర ప్రపంచంలో తన ప్రపంచాధిపత్యానికి సవాలుగా పరిగణిస్తోంది. అందుకే "చైనాను కట్టడి చేయడం" అనే తన గత వ్యూహాత్మక లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకుపోయేందుకు అన్ని రకాలా ప్రయత్నిస్తోంది. హువావి వంటి చైనా కంపెనీలను అడ్డుకుంటున్నది. వాణిజ్య

ఆంక్షలు పెడుతున్నది. చైనా ఆర్థికంగా కోలుకోకుండా చేయడం కోసం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నది.

సైనిక వ్యూహంలో భాగంగా అది దక్షిణ చైనా సముద్రంలో తన బలగాలను మరింత పెంచింది. జూన్‌లో ఈ వివాదాస్పద జలాల్లో మూడు విమానవాహక యుద్ధ నౌకలను మోహరించింది. ఈ ప్రాంతంలో మొట్టమొదటి సారిగా అమెరికా నౌకాదళానికి చెందిన బహుళ విమాన వాహక యుద్ధ నౌకలు సైనిక విన్యాసాల్లో పాల్గన్నాయి. చైనాపై ఒత్తిడి తెచ్చేందుకూ, దాన్ని ఒంటరి చేసేందుకూ అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, భారత్‌లతో 'క్వాడ్' పేరుతో ఒక కూటమిని అమెరికా తయారు చేసింది.

## అమెరికా దురాక్రమణదారీ జోక్యాలు

ఈ మహమ్మారి కాలంలోనే అమెరికన్ సామ్రాజ్యవాదం వెనిజులా, ఇరాన్, సిరియా, ఉత్తర కొరియా వంటి దేశాల్లో అస్థిరత సృష్టించేందుకు జోక్యం పెంచింది. క్యూబాపై ఆర్థిక దిగ్బంధనాన్ని మరింత ఉధృతం చేసింది. క్యూబా, ఇరాన్, వెనిజులాలు కరోనా మహమ్మారితో సమర్థవంతంగా పోరాడేందుకుగాను వాటికి వైద్య పరికరాలు, ఆహారం, ఇతర సరఫరాలు సక్రమంగా అందాలనీ అందువల్ల వాటిపై అమెరికా ఆంక్షలు ఎత్తి వేయాలనీ ఐక్య రాజ్య సమితి పిలుపు నిచ్చింది. కానీ అమెరికా వాటిని చెవిని పెట్టకుండా ఆంక్షలను కొనసాగిస్తూనే ఉంది.

### పాలస్తీనా

పాలస్తీనాకు చెందిన పశ్చిమ తీరంలో తాము అక్రమంగా ఆక్రమించుకున్న 30 శాతం భూభాగాన్ని జులై 1 నుండి తమ దేశ భూభాగాలుగా ప్రకటిస్తామని ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి నెతన్యాహు గతంలో ప్రకటించారు. కానీ ఇది జరగలేదు. కానీ ఆ భూభాగాను స్వాధీనం చేసుకోడానికి సన్నాహాలు జరుగుతున్నాయని చెబుతూ వస్తున్నారు. ఈ అక్రమ ఆక్రమణ అమెరికా ప్రోద్బలంతో, దాని రక్షణ కింద జరుగుతోంది. ట్రంప్, 2020 జనవరిలో పరమ దుర్మార్గమైన "సౌభాగ్యం ద్వారా శాంతి" ప్రథకాన్ని ప్రకటించారు. పాలస్తీనా భూభాగంపై అక్రమంగా యూదు ఆవాసాలు నిర్మించిన ప్రాంతాలను ఇజ్రాయిల్ తనలో కలిపేసుకోవచ్చునని ఈ పథకం చెబుతోంది. పాలస్తీనాకు తూర్పు జరూసలేం రాజధానిగా ఉంటుందని ఐక్య రాజ్య సమితి అనేక తీర్మానాలు చేసినప్పటికీ దాన్ని కాకుండా చేస్తోంది. పాలస్తీనా, ఇజ్రాయిల్

రెండు దేశాలు ఉండాలన్న పరిష్కారాన్ని కాకుండా చేసేందుకే ట్రంప్ ఈ విధంగా చేస్తున్నారు. అందువల్ల పాలస్తీనియన్లకు స్వంత దేశం ఉండాలన్న శతాబ్దం నాటి సమస్యకు పరిష్కారం మరింత దీర్ఘకాలం పొడిగించబడుతోంది.

### సిరియా శాంతి చర్చలు

సిరియాలో తొమ్మిది సంవత్సరాలుగా జరుగుతున్న అంతర్యుద్ధానికి అంతిమ వాచకం పలికేందుకు, అక్కడ పరిస్థితిని స్థిమితపరిచేందుకు ఒక రాజకీయ పరిష్కారం కనుగొనే విషయమై రష్యా, టర్కీ, ఇరాన్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చలు జరిపాయి. తిరుగుబాటు దారుల ఆధీనంలో ఉన్న ఇడ్లిబ్ ప్రాంతంపై సిరియా ప్రభుత్వం సైనిక చర్యలు తీసుకోకుండా మార్చి నెలలో రష్యా, టర్కీలు సర్ధిచెప్పగలిగాయి. దాని ఫలితంగా ఏర్పడిన కాల్పుల విరమణ ఇప్పటి వరకు జయప్రదంగా కొనసాగుతూ వస్తోంది. "సిరియాను ఆర్థికంగా నలిపేసేందుకు ఆంక్షలు విధించడం పట్ల" ఆ దేశాలు అమెరికా, ఐరోపా యూనియన్‌లను తీవ్రంగా విమర్శించాయి. కానీ సిరియాను మరింత అస్థిర పరిచేందుకు అమెరికా కొత్త ఆంక్షలు విధించింది.

## తీవ్రమవుతున్న ప్రపంచ సామాజిక వైరుధ్యాలు

ఈ పరిణామాల వల్ల నాలుగు ప్రధాన ప్రపంచ సామాజిక వైరుధ్యాలు అంటే సామ్రాజ్యవాదానికీ – సోషలిజానికీ మధ్య, సామ్రాజ్యవాదానికీ – అభివృద్ధి చెందుతున్న దేశాలకూ మధ్య, సామ్రాజ్యవాదుల్లోనే వాళ్లకీ వాళ్లకీ మధ్య, శ్రమకూ–పెట్టుబడికీ మధ్య వైరుధ్యాలు వివిధ మోతాదుల్లో తీవ్రతరమవుతున్నాయి. ప్రపంచ స్థాయిలోనూ, ప్రతి పెట్టుబడిదారీ దేశంలోనూ వర్గ పోరాటాలు తీవ్రమవుతున్న ఈ కాలంలో అంతర్జాతీయ స్థాయిలో ఈ పోరాటాలతో మన సౌహార్ద్రత పటిష్ట పరుచుకోవడం, భారత దేశంలో వర్గ పోరాటాన్ని పెంపొందించడం మన పార్టీ కర్తవ్యం.

# జాతీయ పరిణామాలు

## కోవిడ్ మహమ్మారి పరిస్థితి

దేశంలో కోవిడ్ మహమ్మారి అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతోంది. కోవిడ్ కేసులు, మరణాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇది చాలా తీవ్రమైన పరిస్థితి.

ప్రపంచంలో కరోనా మహమ్మారి వల్ల మొట్టమొదటి మరణం 2019లో చైనాలోని వూహాన్‌లో నమోదైంది. ఇది ప్రపంచ మంతా వ్యాపించే అవకాశముందని

అన్ని దేశాలనూ హెచ్చరించడం జరిగింది. అనేక దేశాలు మహమ్మారి కట్టడికి కొన్ని చర్యలు తీసుకున్నాయి. కానీ భారతలో మాత్రం అప్పుడు అటువంటి కట్టడి చర్యలేవీ తీసుకోలేదు.

భాతర దేశంలో మొట్టమొదటి కరోనా పాజిటివ్ కేసు జనవరి 30న కేరళలో నమోదయింది. కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రపంచ వ్యాపిత హెచ్చరిక వచ్చిన వెంటనే వ్యాధి కట్టడికి సన్నాహాలు ప్రారంభించింది. వూహాన్ నుండి ప్రపంచంలోని ఇతర ప్రాంతాల నుండి రాష్ట్రానికి వచ్చే వారి నుండి ముఖ్యంగా కేరళ విద్యార్థుల నుండి మహమ్మారి రావచ్చునని రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే ఊహించి సన్నాహాలు ప్రారంభించింది. పాజిటివ్ కేసులు రాకముందు నుండే అంటే జనవరి 20 నుండే జిల్లా నివారణ కేంద్రాలు పనిచేయడం ప్రారంభించాయి.

కేరళ మాదిరిగా కాకుండా కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి నెల మొత్తం, మార్చి తొలి మూడు వారాలు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ కాలంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్న పెద్ద కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గన్నవారెవరూ భౌతిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం, శానిటైజర్లు ఉపయోగించడం వంటి ముందు జాగ్రత్త చర్యలేవీ తీసుకోలేదు. నిజానికి ఇలాంటి చర్యలు తీసుకోవాలన్న సామాజిక అవగాహన ప్రచారం కూడా జరపలేదు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో అహమ్మదాబాద్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆహ్వానించడం వంటి కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. 2020 ఫిబ్రవరి 24న మొతేరా స్టేడియంలో జరిగిన 'నమస్తే మోడి' కార్యక్రమానికి లక్షలాది మంది ప్రజలను సమీకరించారు. ఈశాన్య ఢిల్లీలో జరిగిన ఘోరమైన మత హింసాకాండ, మహమ్మారిని ఎదుర్కొనే సన్నాహాల నుండి దృష్టిని పక్కకు మళ్లించింది. మహమ్మారిని ఎదుర్కొనే కృషినీ, సామర్థ్యాన్నీ ఇది నీరుగార్చింది. ఢిల్లీలో తబ్లిఘి మర్కజ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మహమ్మారి తీవ్రంగా ఉన్న మలేసియా, ఇండోనీషియా వంటి దేశాల నుండి ప్రతినిధులు వచ్చారు. ఇటువంటి పరిస్థితుల్లో నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం వారి బాధ్యతా రాహిత్యం. అయితే, ఈ కార్యక్రమానికి అనుమతులు, వీసా క్లియరెన్సులు చేసింది కేంద్ర ప్రభుత్వం. దీనికి భిన్నంగా మహరాష్ట్ర ప్రభుత్వం అటువంటి కార్యక్రమానికి అనుమతులు నిరాకరించింది. మార్చి 23 వరకు పార్లమెంటు సమావేశాలు జరుగుతూనే ఉన్నాయి.

అప్పుడు దాన్ని నిరవధికంగా వాయిదా వేశారు. మధ్యప్రదేశ్‌లో ఎంఎల్‌ఎలను కొనుగోలు చేయడం ద్వారా ప్రజాతంత్ర యుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చి వేసి, ఆ రోజు సాయంత్రమే బిజెపి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసింది. భోపాల్‌లో బహిరంగంగా జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు.

**జాతీయ లాక్‌డౌన్:** ఆ మరునాడే, మార్చి 24న, ప్రధాన మంత్రి 21 రోజుల జాతీయ లాక్‌డౌన్ ప్రకటించారు. దేశానికీ, రాష్ట్ర ప్రభుత్వాలకూ, ప్రజలకూ ఆయన కేవలం నాలుగు గంటల సమయం మాత్రమే ఇచ్చారు. ఈ లాక్‌డైన్‌ను మూడు సార్లు పొడిగించారు. జూన్ 1న ముగిసింది. లాక్‌డౌన్ నిషేధాలు సడలించిన తరువాత నుండి ప్రతి రోజు కరోనా కేసులు, మరణాలు పెరుగుతూ వస్తున్నాయి.

లాక్‌డౌన్ జబ్బును నయంచేసే మందు కాదు. ఇది వ్యాధి విస్తరించకుండా కట్టడి చేయడానికి దోహదపడుతుంది, వ్యాప్తిని అరికట్టే సన్నాహాల కోసం కొంత సమయాన్ని ఇస్తుంది. ప్రజలకు విస్తృతంగా టెస్టులు చేయడానికీ, పాజిటివ్ వచ్చిన వారిని వేరుగా పెట్టడానికీ, పాజిటివ్ వచ్చిన వారితో తారసపడిన వ్యక్తులను గుర్తించి క్వారెంటైన్‌కు పంపడానికీ ఈ లాక్‌డౌన్ కాలాన్ని ఉపయోగించుకోవాలి. కానీ కేంద్ర ప్రభుత్వం ఈ పని చేయలేదు.

మహాభారత యుద్ధంలో 18 రోజుల్లో విజయం సాధించినట్లే కరోనాపై భారత దేశం 21 రోజుల్లో విజయం సాధిస్తుందని ప్రధాన మంత్రి మాయమాటలతో ప్రజలను నమ్మించారు. కాని వాస్తవం ఏమంటే లాక్‌డౌన్ మన ప్రజలను తీవ్రమైన ఈతిబాధల్లోకి నెట్టేసింది.

**వైద్య సదుపాయాలు సమకూర్చుకున్నది లేదు:** లాక్‌డౌన్ కాలాన్ని ఉపయోగించుకుని మన వైద్య, ఆసుపత్రి సదుపాయాలను పెంచుకుని ఉండాల్సింది. మన డాక్టర్లు, ఆరోగ్య కార్యకర్తలకు వ్యక్తిగత రక్షణ పరికరాలు (పిపిఇలు) సమకూర్చి ఉండాల్సింది. పెద్ద ఎత్తున కరోనా పరీక్షలకు సన్నద్ధం కావాల్సింది. లాక్‌డౌన్‌కు ముందుగానీ, లాక్‌డౌన్ కాలంలో గానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ చర్యలేవీ తీసుకోలేదు. భారత దేశంలో ఘోరంగా వెయ్యిమంది ప్రజలకు 0.8 మంది డాక్టర్లు, వెయ్యిమంది ప్రజలకు 0.7 ఆసుపత్రి పడకలు ఉన్నాయి. కోవిడ్-19 రోగుల చికిత్స కోసం కేంద్ర ప్రభుత్వం ప్రయివేటు ఆసుపత్రులను కూడా స్వాధీనం చేసుకుని ఉండాల్సింది. కొన్ని రాష్ట్రాల్లో అడపాదడపా మినహా ఈ పని ఇంతవరకు జరగలేదు.

స్పెయిన్ వంటి దేశాలు తమ ప్రయివేటు ఆసుపత్రుల్లోని సదుపాయాలను జాతీయం చేశాయి. ఇప్పటికీ పిపిఇల కొరత ఉంది. ప్రపంచంలోనే అతి తక్కువ కోవిడ్ పరీక్షల రేటు ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. మన దేశంలో ప్రతి వెయ్యి మందిలో 8 మందికి పరీక్షలు జరుగుతున్నాయి.

**ప్రజల కష్టాలు:** ప్రణాళికా రహితంగా, అశాస్త్రీయంగా, అకస్మాత్తుగా విధించిన లాక్‌డౌన్ మన ఆర్థిక వ్యవస్థనూ, ప్రజల జీవనభృతినీ దెబ్బతీసింది. వలస కార్మికుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. రెండు మాసాల పాటు వారు కుటుంబాలతో సహా రోడ్లపై నడుచుకుంటూ తమ స్వస్థలాలకు తరిగి వెళ్లారు. కొంత సన్నాహం చేసిన తరువాత లాక్‌డౌన్ విధించి ఉంటే ఈ వలస కార్మికుల్లో అనేక మంది స్వంత ఖర్చులతో స్వస్థలాలకు వెళ్లి ఉండేవారు. అకస్మాత్తుగా లాక్‌డౌన్ విధించి వారిని అటువంటి కష్టాలకు గురి చేసిన బిజెపి కేంద్ర ప్రభుత్వం కనీసం వారికి ఉచిత రవాణా కూడా సమకూర్చడానికి నిరాకరించింది. లాక్‌డౌన్ అయిన చాలా వారాల తరువాత ప్రత్యేక శ్రామిక్ రైళ్లను ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల నుండి రైల్వేలకు అడ్వాన్స్ చెల్లింపులు జరపాలని డిమాండ్ చేసింది. అనేక సందర్భాల్లో కార్మికులే అప్పోసప్పో చేసి చెల్లించాల్సి వచ్చింది. అశాస్త్రీయంగా, అకస్మాత్తుగా, ఏకపక్షంగా విధించిన లాక్‌డౌన్ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మోయాల్సి వచ్చింది. ప్రధాన మంత్రి పేరుతో ప్రయివేటు ట్రస్ట్ ఏర్పాటు చేసి కోట్లాది రూపాయలు సేకరించినప్పటికీ రాష్ట్రాలకు ఆర్థికంగా సహాయం చేయలేదు.

**నగదు బదిలీలు, ఉచిత ఆహారం:** పన్ను చెల్లించే వారు కాకుండా మిగిలిన అన్ని కుటుంబాలకూ నెలకు రూ. 7,500 నగదు, కేంద్ర ప్రభుత్వ గోదాముల్లో పేరుకుపోయి ఉన్న ఆహార ధాన్యాల నుండి నెలకు వ్యక్తికి 10 కిలో గ్రాముల చొప్పున తిండి గింజలు ఆరు మాసాల పాటు సరఫరా చేయాలని లాక్‌డౌన్ ప్రకటించినప్పటి నుండీ పార్టీ డిమాండ్ చేస్తోంది. కానీ కేంద్ర ప్రభుత్వం ఈ పని చేయకుండా ప్రజలను ఆకలికీ, నిరుద్యోగానికీ విడిచిపెట్టేసింది.

## ఆర్థిక ప్రభావం

కోవిడ్-19 ప్రభావం మనకు తాకక ముందే భారత ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుకుంటున్నది. జిడిపి పెరుగుదల 2018-19లో 6.1 శాతం నుండి 2019-20 ఆర్థిక సంవత్సరంలో 4.2 శాతానికి పడిపోయింది. ఈ ఏడాది

జిడిపి పెరుగుదల రేటు బాగా పడిపోతుందని అనేక అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు, దేశీయ స్వతంత్ర సంస్థలు అంచనా వేశాయి. (–) 3.2 శాతం నుండి (–) 6.8 శాతానికి పడిపోతుందని అంచనా వేశాయి. ప్రపంచ బ్యాంకు (–) 3.2శాతం పడిపోతుందనీ, ఐఎంఎఫ్ (–) 4.5 శాతం, ఆసియా అభివృద్ధి బ్యాంకు (–) 4 శాతం పడిపోతుందని అంచనా వేశాయి. నమూరా (–) 5.2 శాతం పడిపోతుందిన అంచనా వేసింది. కోవిడ్ మహమ్మారి వల్ల భారత జిడిపి ఏకంగా 11 శాతం పడిపోతుందని ఎస్ అండ్ పి అంచనా వేసింది. ఇది లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల్లో జరిగిన నష్టాన్ని కలుపుకుంటే జరిగే నష్టమంత. మిగతా ఆసియాలో జరిగే నష్టానికి 5 నుండి 6 రెట్లు ఎక్కువ. ఆర్థిక వృద్ధి క్షీణత (–) 6.8 శాతం ఉంటుందని భారత ఎస్‌బిఐ అంచనా వేయగా, (–) 9.5 శాతం ఉంటుందని ఐసిఆర్ఎ అంచనా కట్టింది. కేర్ రేటింగ్ సంస్థ వృద్ధి రేటు క్షీణత (–) 6.4 శాతం ఉంటుందని తెలిపింది.

తీవ్రమైన మాంద్యంలోకి జారుకుంటున్న ఆర్థిక వ్యవస్థను పునరుత్తేజ పరచడానికి ప్రభుత్వ పెట్టుబడులు పెద్ద ఎత్తున పెట్టడమొక్కటే మార్గమని కరోనా మహమ్మారికీ, లాక్‌డౌన్‌కూ ముందే పార్టీ సూచించింది. ప్రభుత్వ పెట్టుబడుల ద్వారా చాలా అవసరంగా ఉన్న మౌలిక వసతులను నిర్మిస్తే పెద్ద ఎత్తున కొత్త ఉద్యోగాలను కల్పించవచ్చు, దాని వల్ల భారత ఆర్థిక వ్యవస్థలో దేశీయ గిరాకీ పెరుగుతుంది. దీని వల్ల ఇప్పటికే మూతబడి ఉన్న ఫాక్టరీలు తెరుచుకుంటాయి, ఆగిపోయిన వస్తూత్పత్తి తిరిగి ప్రారంభమవుతుంది. కానీ నయా–ఉదారవాద ఎజెండాకు కట్టుబడి ఉన్న మోడీ ప్రభుత్వం భారత ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయే విధానాలను కొనసాగిస్తోంది. దాని వల్ల ఆర్థిక వ్యవస్థ మరింత తీవ్రమైన మాంద్యంలోకి పోతోంది.

కోవిడ్, లాక్‌డౌన్ అనంతర కాలంలో మోడీ ప్రభుత్వం మరింతగా ప్రభుత్వ జోక్యాన్ని పెంచాల్సింది పోయి నయా–ఉదారవాద ఎజెండాను ఇంకా ఉధృతంగా అమలు పరుస్తోంది. దాంతో ప్రజల ఈతిబాధలు, కష్టాలు పెరుగుతున్నాయి. దీనివల్ల ఆర్థిక అసమానతలు అంతులేకుండా పెరిగిపోతున్నాయి, క్రోనీ పెట్టుబడిదారీ వ్యవస్థ పైపైకి ఎగబాకుతోంది. ప్రభుత్వం ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీ కూడా స్వచ్ఛమైన నయా–ఉదారవాద నివారణా చర్యలు... అంటే పెద్దఎత్తున ప్రయివేటీకరణ, ప్రయివేటు పెట్టుబడి దోపిడీకి భారత మార్కెట్లనూ, ఆర్థిక సంపదనూ అప్పనంగా అప్పగించడం,

శ్రామిక ప్రజల హక్కులపై దాడులు చేయడం వంటి వాటితో కూడి ఉంది. ఇది ప్రజలపై మరిన్ని ఆర్థిక భారాలు మోపుతుంది, కష్టాలకు గురిచేస్తుంది.

**నిరుద్యోగం:** లాక్‌డౌన్ కాలంలో దాదాపు 15 కోట్ల మంది ప్రజల ఉద్యోగాలు పోయాయని భారత ఆర్థిక వ్యవస్థను గమనిస్తున్న సంస్థ (సిఎంఐఇ) అంచనా వేసింది. ఏప్రిల్, మే నెలల మధ్య నిరుద్యోగం 23.5 శాతం నుండి 27.1 శాతానికి పెరిగింది. 2019-20లో సగటున 40.4 కోట్ల మంది ఉపాధి పొందుతుండగా ఏప్రిల్ 2020లో అంటే లాక్‌డౌన్ మొదటి నెలలో 28.2 కోట్లకు పడిపోయింది. 30 శాతం, అంటే 12.2 కోట్ల ఉద్యోగాలు పోయాయన్న మాట.

ఉద్యోగాలు పోయిన వారిలో ఎక్కువ మంది దినసరి కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు, చిన్న వ్యాపారులు ఉన్నారు. 2019-20 సంవత్సరంలో ఈ సెక్షన్ల కార్మికులు సగటున 12.8 కోట్ల మంది ఉన్నారు. ఏప్రిల్ నాటికి వారి సంఖ్య 3.7 కోట్లకు పడిపోయింది. అంటే ఒక్క నెలలో 9.1 కోట్ల మంది జీవనోపాధి కోల్పోయారన్నమాట. వీరిలో 1.7 కోట్ల మంది మహిళలున్నారు. స్థిరమైన ఆస్తులున్న పెద్ద పరిశ్రమల్లో పని చేసే కార్మికుల్లో 23 శాతం మంది ఉద్యోగాలు పోయాయి. అంటే 2019-20లో వారి సంఖ్య 7.8 కోట్ల నుండి 2020 ఏప్రిల్ నాటికి 6 కోట్లకు పడిపోయింది. 1.8 కోట్ల మంది వ్యాపారులు ఉపాధి కోల్పోయారని అంచనా వేశారు. జీతాలు తీసుకుంటున్న ఉద్యోగు సంఖ్య 2019-20లో 8.6 కోట్ల నుండి 2020 ఏప్రిల్ నాటికి 6.8 కోట్లకు పడిపోయింది. అంటే ప్రతి అయిదుగురు ఉద్యోగస్తుల్లో ఒకరి ఉద్యోగం పోయింది.

నిరుద్యోగం ప్రభావం యువత మీద చాలా ఆందోళనకరంగా ఉంది. 20 నుండి 29 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న యువతలో 2.7 కోట్ల మంది ఉద్యోగాలు పోయాయి. 30 నుండి 39 సంవత్సరాల వయసులో ఉన్నవారిలో 3.3 కోట్ల ఉద్యోగాలు పోయాయి.

**ఆర్థిక పునరుత్తేజపు "పచ్చని మొలకలు"?:** తాను ఆర్థిక పునరుత్తేజపు "పచ్చని మొలకలు" చూస్తున్నానని ప్రధాని మోడీ ఇప్పుడు చెబుతున్నారు. లాక్‌డౌన్ నిబంధనలు సడలించిన తరువాత నిరుద్యోగం తగ్గుతున్నట్టు కనిపిస్తోంది కాబట్టి ఆయన అలా అంటున్నారు.

వాస్తవం ఏమంటే, లాక్‌డౌన్ వల్ల ఏప్రిల్‌లో పోయిన 12.2 కోట్ల ఉద్యోగాల్లో 9.1 కోట్ల ఉద్యోగాలు జూన్‌లో వచ్చాయి. అయితే 2019–20లో సగటు ఉద్యోగాలు 40.4 కోట్లు ఉండగా జూన్‌లో ఉద్యోగాలు 37.4 కోట్లు నమోదయ్యాయి. అంటే 3 కోట్లు తక్కువ. లాక్‌డౌన్ సడలించడంతో చిన్న వ్యాపారులు, దినసరి కూలీలు వారి పనుల్లోకి వచ్చి చేరారు. ఇలా తిరిగి వచ్చిన ఉద్యోగాల్లో 63 శాతం అసంఘటిత రంగానికి చెందినవే. అయితే వారి పాత ఆదాయాలు మాత్రం తిరిగి రాలేదు. చిన్న వ్యాపారులు తమకు దగ్గరలోని వ్యసాయానికి మళ్లినట్లు అనేక ఉదాహరణలున్నాయి. వ్యవసాయంలో పనులు చేయడం పెరిగింది. సాధారణంగా ఆర్థిక సంక్షోభం వచ్చినప్పుడు చిన్న, రిటైల్ రంగాల్లో ఆదాయాలు పడిపోవడంతో ప్రజలు పొలాల్లో పనిచేయడానికి వచ్చేస్తారు, దాంతో వ్యవసాయంలో పనులు చేయడం పెరుగుతుంది. ఇది ఒకరకంగా దాగిఉన్న నిరుద్యోగానికి సూచన. ఇదంతా సంక్షోభానికి చిహ్నమేగాని, ఉపాధి పెరుగుదల కాదు. పునరుద్ధరించబడిన ఉద్యోగాలుగా చెప్పబడుతున్న వాటిలో 80 శాతం చిన్న వ్యాపారులకు, దినసరి కూలీలకూ, రైతులకు సంబంధించినవి. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తగినతంగా కాకపోయినా ఉపాధి పొందేవారి సంఖ్య పెరగడం కూడా దీనికి సూచనే.

లాక్‌డౌన్ కాలంలో భారత దేశానికి 2,000 కోట్ల డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐలు) వచ్చాయని ప్రధాని మోడీ గొప్పగా చెప్పారు. ఇది కూడా ఆర్థిక పునరుత్తేజపు పచ్చని మొలకలకు నిదర్శనంగా చెబుతున్నారు. వాస్తవమేమంటే, దీన్లో 1,840 కోట్ల డాలర్లు అంబానీకి చెందిన రిలయన్స్ కంపెనీ వాటాలు అమ్మగా వచ్చినవి. ఇది పెట్టుడి రావడం కాదు. బహుళజాతి కంపెనీలతో ఒప్పందాల ద్వారా వాటాల అమ్మకం నుండి వచ్చిన డబ్బులు.

**పరిశ్రమలు:** లాక్‌డౌన్ విధించడానికి ముందు ఒక్క మార్చి నెలలోనే పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) విపరీతంగా పడిపోయింది. ప్రధానమైన ఎనిమిది మౌలిక రంగాల్లో ఉత్పత్తి బాగా పడిపోయింది. లాక్‌డౌన్ తరువాత ఏప్రిల్‌లో ఐఐపి 55.5 శాతం పడిపోయిందని, తరువాత మే నెలలో మరింతగా 34.7 శాతం పడిపోయిందని బ్లూమ్‌బెర్గ్ తెలిపింది.

**లాక్‌డౌన్ సందర్భంగా లాభాలవేట:** ఉత్పత్తి, సర్వీసులు అన్ని రకాలుగా దిగజారిపోతున్న ఈ పరిస్థితుల్లో భారత దేశంలోని మహా ధనవంతుల సంపద

విపరీతంగా పెరిగిపోతున్నది. బాగా లాభం పొందిన వారిలో ముఖేష్ అంబానీ ఒకరు. ఏప్రిల్ ఒక్క నెలలోనే ఆయన 1000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెంచుకున్నారు. అంబానీ సంపద ఇప్పుడు 5,270 కోట్ల డాలర్లు. మహమ్మారి వచ్చిన తరువాత ఆయన సంపద 2000 కోట్ల డాలర్లు పెరిగింది. జనవరి కేంద్ర కమిటీ సమావేశంలో చెప్పినట్లు భారత దేశంలో ఆదాయ అసమానతలు తీవ్ర స్థితికి చేరుకున్నాయి. ధనవంతులైన ఒక్క శాతం ప్రజల సంపద కింది స్థాయిలోని 70 శాతం ప్రజల సంపదకన్నా నాలుగింతలు ఎక్కువకు చేరుకుంది.

**వ్యవసాయం:** లాక్‌డౌన్ కాలంలో మరింత దిగజారిపోయిన వ్యవసాయ సంక్షోభాన్ని మరిన్ని ప్రభుత్వ పెట్టుబడులు పెట్టడం ద్వారా పరిష్కరించాల్సింది పోయి మన రైతులకు రుణ సదుపాయం కల్పించడంపై కేంద్రీకరించారు. ఇప్పటికే రుణభారం పెరిగిపోయి ఆవేదనతో ఆత్మహత్మలకు పాల్పడుతున్న మన రైతులు మరిన్ని కొత్త రుణాలు తీసుకోకపోవచ్చు.

ఉద్దీపన ప్యాకేజీగా చెప్పబడుతున్న దాని ద్వారా కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల చట్టాన్ని రద్దు చేస్తూ ఆర్డినెన్సులు జారీ చేసింది. ఆహార ధాన్యాల ధరలకు అదుపు లేకుండా రాష్ట్రాల సరిహద్దులు దాటించి రవాణా చేసేందుకుగాను ఎపిఎంసి చట్టాన్ని సవరించారు. భవిష్యత్తులో దీనివల్ల దేశ ఆహార భద్రతకు ముప్పువాటిల్లుతుంది. మధ్య దళారీలచేతిలో ఆహారోత్పత్తి చేసే రైతులు, వినియోగదారులైన ప్రజలు నష్టపోతారు. ఎందుకంటే గరిష్ట లాభాలు పొందేందుకు ఈ మధ్య దళారీలు కృత్రిమ కొరత సృష్టిస్తారు. కనీస మద్దతు దరతో ఆహార ధాన్యాల సేకరణకూడా అంతమైపోతుంది గనుక రైతులకు ఉన్న కొద్దిపాటి రక్షణ కూడా లేకుండా పోతుంది. ఇది దేశంలో ఉన్న కొద్దిపాటి ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను కూడా నాశనం చేస్తుంది. మరీ ముఖ్యంగా దేశంలోని వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెట్లను బడా బహుళజాతి వ్యవసాయ వ్యాపార సంస్థలు, దేశీయ కార్పొరేట్లు పూర్తిగా చేజిక్కించుకునేందుకు ఈ చర్యలు దారితీస్తాయి. 'కాంట్రాక్టు వ్యవసాయానికి' ఇప్పటికే మార్గదర్శకాలు రూపొందించబడ్డాయి.

**నగదు బదిలీ కబుర్లు:** తొమ్మిది కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరుస్తూ వారికి నగదు బదిలీ కోసం 18,000 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు మోడీ కబుర్లు చెప్పారు. ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద 14 కోట్ల మంది రైతులకు

ఏడాదికి రూ. 2000 చొప్పున మూడేళ్ల పాటు ఇస్తామని 2019 పార్లమెంటు ఎన్నికల తరుణంలో హామీ ఇచ్చారు. మోడీ చేసినట్లు చెప్పుకుంటున్నదల్లా ఈ పథకంలో రెండో వాయిదా చెల్లించడమే. రైతులకు 14 కోట్లమందికి బదులు ఇప్పుడు 9 కోట్ల మంది రైతులకు మాత్రమే ప్రయోజనం అందుతోంది. ఈ రీ ప్యాకేజింగ్ జిమ్మిక్కు వల్ల అయిదు కోట్ల మంది రైతులకు రావాల్సిన కొద్దిపాటి ప్రయోజనం కూడా రాకుండా పోయింది.

వితంతువులకు, వికలాంగులకు, జన్‌ధన్ అకౌంట్లు ఉన్న వారికీ రూ. 1000 చొప్పున రెండు వాయిదాల్లో ఇస్తామని కూడా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో చాలా వరకు వారికి అందనే లేదు. వికలాంగులకు సంబంధించినంతవరకు కేవలం 3.81 శాతం మందికి మాత్రమే ప్రయోజనాలు అందాయి. ఇటువంటి పథకాలు ప్రకటించినప్పటికీ ఇవన్నీ చాలా కొద్ది మందికి మాత్రమే అందుతాయి. బాధలు పడుతున్న పెద్ద మెజారిటీ ప్రజలకు ఎటువంటి ప్రయోజం ఉండదు.

**గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ రెగా):** ఈ పథకం కింద గత సంవత్సరం 8.23 కోట్ల మంది ప్రజలకు ఉపాధి లభించింది. 2019–20లో అదనంగా కోటి మంది ప్రజలకు ఏడాదికి 100 రోజుల పనిదినాలు కల్పించబడ్డాయి. దానికోసం ప్రభుత్వం మొత్తం రూ 2,46,000 కోట్ల రూపాయలు కేటాయించాల్సి ఉంది. కానీ దానికి బదులుగా ఏడాది మొత్తంగా రూ. 90,000 కోట్లు మాత్రమే కేటాయించింది. అందువల్ల ఉద్దీపన పథకంలో అదనంగా ప్రకటించిన రూ. 40,000 కోట్లు ఏ మాత్రం సరిపోవు.

ఏప్రిల్, మే నెలల్లో గ్రామీణ ప్రాంతాల్లో అసాధారణంగా 8.4 కోట్ల మంది గ్రామీణ ఉపాధి పథకం కింద పని కోరారు. కానీ సిగ్గుచేటైన విషయమేమంటే 1.8 కోట్ల మందికి పని కల్పించకుండా వెనక్కు పంపేశారు. ఇందులో ఉత్తర ప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. కావలసిన నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం ఈ చట్టాన్ని వమ్ము చేస్తోంది. మరోవైపు ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ రోజ్‌గార్ యోజన పేరుతో చట్టబద్ధం కాని పథకాలను ముందుకు తెస్తోంది.

ఏడాదికి కనీసం 200 రోజులు పని కల్పించే విధంగా గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలి. పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని చేయాలి. నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి కల్పించాలి.

**ఇఐఎ 2020ని వ్యతిరేకించాలి:** వాతావరణ ప్రభావ అంచనా 2020 (ఇఐఎ 2020) ముసాయిదా అనేది భారత దేశ ప్రకృతి వనరులను కార్పొరేట్లకు దోచి పెట్టేందు ఉద్దేశింపబడింది. ఇందులో ప్రతిపాదించబడిన నిబంధనలు ప్రజాభిప్రాయ సేకరణ నుండి అనేక ప్రాజెక్టులకు మినహాయింపునిస్తాయి. గనులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆదివాసీ ప్రజలకు ఉన్న రాజ్యాంగ, చట్టపరమైన రక్షణలను ఎత్తివేస్తాయి, తీవ్రమైన ఉల్లంఘనలకు అనుమతిస్తాయి. ఇందులో ఇతరత్రా అనేక తిరోగమన ప్రతిపాదనలు ఉన్నాయి. వీటిలోని అనేక సమస్యలపై జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పులను, చివరికి సుప్రీం కోర్టు తీర్పులను కూడా ఈ నోటిఫికేషన్ చెల్ల కుండా చేస్తుంది. దీన్ని ఉపసంహరించుకోవాలి.

## ప్రజలపై భారాలు

నేరుగా నగదు బదిలీ చేయడం, ఉచిత ఆహార పంపిణీ వంటి సహాయ చర్యల ద్వారా ప్రజలను ఆదుకోవాల్సింది పోయి మోడీ ప్రభుత్వం ప్రజలపై ఎన్నడూ ఎరుగనన్ని  భారాలను మోపుతోంది.

**పెరుగుతున్న ద్రవ్యోల్బణం:** జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బిఐ విధించిన 6 శాతం హద్దులు దాటేసి (గతంలో ఉన్న 4 శాతం సీలింగును పెంచారు) 6.1 శాతం నమోదయింది. ఆహారం, పానీయాల ధరలు 7.3 శాతం పెరిగినట్లు వినియోగదారుల ధరల సూచీ తెలుపుతోంది. ప్రోటీన్లకు ప్రధాన వనరు అయిన పప్పుల ధరలు 16.7 శాతం పెరిగాయి. పాలు, పాడి ఉత్పత్తుల ధరలు 8.4 శాతం, మాంసం, చేపల ధరలు 16.2 శాతం పెరిగాయి. చివరికి ఎప్పటికప్పుడు వాడకపోతే పాడైపోయే కాయగూరల ధరలు కూడా 2 శాతం పెరిగాయి. ఇది ప్రజల బాధలను మరింత పెంచుతోంది.

కరోనా మహమ్మారి పరిస్థితుల్లో కూడా ఈ మహమ్మారి విస్తరించకుండా కాపాడే శానిటైజర్ల మీద, ఇతర పరిశుభ్రత వస్తువుల మీద ప్రభుత్వం 18 శాతం జిఎస్‌టి వసూలు చేస్తోంది.

పెట్రోలియం ధరలు పెద్ద ఎత్తున పెంచడం వల్ల ప్రజల కష్టాలు మరింత పెరిగాయి. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలను వరుసగా 16 రోజుల పాటు పెంచేశారు. లాక్‌డౌన్ కాలంలో ప్రభుత్వ ఆదాయం పెంచుకునేందుకు పెట్రోలియం ఉత్పత్తుల మీద ఎక్సైజ్ సుంకాన్ని భారీగా పెంచారు. 2014లో బిజెపి ప్రభుత్వం

అధికారం చేపట్టినప్పుడు డీజిల్ మీద ఎక్సైజ్ సుంకం లీటరుకు రూ. 2.56. అది ఇప్పుడు 31.83 రూపాయలు. అలాగే పెట్రోలు మీద రూ 9.40 నుండి రూ 32.98కి పెంచేశారు. రేషన్ ద్వారా ఇచ్చే కిరోసిన్ ధరను 2014లో రూ 14.96 నుండి ఇప్పుడు రూ. 21.70కు పెంచేశారు. ప్రభుత్వం ఆదాయాలు పొందుతున్నప్పటికీ ప్రజల మీద భారాలు పడుతున్నాయి. వరుసగా రెండు మాసాలపాటు ఎల్‌పిజి సిలిండర్ ధరను సిలిండర్‌కు రూ. 5 చొప్పున పెంచేశారు.

**వలస కార్మికులు:** జీవనభృతి కోసం పొట్టచేతపట్టుకుని పట్టణాలకూ, వ్యవసాయం బాగా జరిగే కేంద్రాలకూ వచ్చిన వలస కార్మికుల కష్టాలు, దుర్భల పరిస్థితిని దేశం మొత్తం చూసింది. ప్రభుత్వం ఇప్పుడు అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం 1979ని రద్దు చేయాలని చూస్తోంది. దీని వల్ల ఈ కార్మికులకు ఉన్న కొద్దిపాటి న్యాయ రక్షణ కూడా లేకుండా పోతుంది. ఈ చట్టాన్ని ఎన్నడూ అమలు జరపక పోవడం వల్ల వలస కార్మికుల రిజిస్టర్లను రాష్ట్ర ప్రభుత్వాలుగానీ, వారిని పనిలో పెట్టుకున్న సంస్థలు గానీ నిర్వహించడం లేదు. ఈ చట్టాన్ని రద్దు చేయడాన్ని తిరస్కరించాలి. దాన్ని మరింత పటిష్ట పరచాలి.

**తీవ్రమవుతున్న సామాజిక అసమానతలు:** ఈ విధంగా నయాఉదారవాద ఎజెండాను ఉధృతంగా అమలు చేయడం వల్ల సమాజంలో వెనుకబడిపోయిన సెక్షన్లు ముఖ్యంగా ఆదివాసీలు, దళితులు, మహిళలు బాగా నష్టపోతున్నారు. వికలాంగుల చట్టంలోని పెనాల్టీలు కార్పొరేట్ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయి గనుక ప్రభుత్వం వీటిని తొలగించే విధంగా వికలాంగుల హక్కుల చట్టాన్ని సవరించడానికి ప్రయిత్నించింది. అయితే ప్రతిపక్షాల నుండి తీవ్రమైన వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం వెనక్కు తగ్గింది.

ప్రస్తుతం నెలకొని ఉన్న సామాజిక పీడన, వివక్షలు కూడా తీవ్రమైనాయి. దళితులపై కులపరమైన అత్యాచారాలు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో దళితులకు పంచిన భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే నిర్వాసితులుగా మారుతున్న ఆదివాసీల అటవీ భూమి హక్కులపై సరికొత్త దాడులు జరుగుతున్నాయి. గ్రామ సభలు జరపాలన్న హక్కులను కూడా తొలగిస్తున్నారు. మహిళలకు జీతం లేని సంరక్షణ పని భారం విపరీతంగా పెరిగిపోయింది. దానికి తోడు వాళ్లపై లైంగిక, గృహ హింస పెరిగింది.

**ఆహార పంపిణీ:** ఆహార ధాన్యాలను ఉచితంగా పంచుతున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. కాని వాస్తవం ఇలా ఉంది: (1) ప్రస్తుతం ఎఫ్‌సిఐ వద్ద 10.4 కోట్ల టన్నుల ఆహారధాన్యాల నిల్వలున్నాయి. (2) జాతీయ ఆహార భద్రత చట్టం కింద రాష్ట్రాలకు నెలకు 43 లక్షల టన్నులు కేటాయిస్తున్నారు. (3) ప్రభుత్వం చెప్పుకుంటున్నట్లు ప్రతి వ్యక్తికీ అదనంగా 5 కిలోలు ఇస్తే రాష్ట్రాలకు కేటాయించే ఈ మొత్తం రెట్టింపు చేయాలి. (4) ఆ విధంగా చూసినప్పుడు కనీసం 43 లక్షల టన్నులు అదనంగా కేటాయించాలి. కానీ ఏప్రిల్ నెలలో ప్రధాన మంత్రి కల్యాణ్ యోజన కింద కేటాయించింది 26 లక్షల టన్నులు, మే నెలలో 29 లక్షల టన్నులు మాత్రమే.

**ఆరోగ్యం:** కరోనా మహమ్మారి, లాక్‌డౌన్‌లు మన దేశంలోని ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ ఎంత బలహీనంగా ఉందో తెలిపాయి. చాల ప్రాంతాల్లో అసలు ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాలే లేవు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్న చోట కూడా వాటిలో సదుపాయాలు చాలా తక్కువ. ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో సదుపాయాలను వెంటనే ఉన్నతీకరించాలి.

ఈ కాలంలో మన ప్రజల మానసిక ఆరోగ్యానికి సంబంధించిన అనేక సమస్యలు ముందుకొచ్చాయి. మహమ్మారి వల్ల వచ్చిన మానసిక ఆందోళన, సుదీర్ఘమైన లాక్‌డౌన్ వల్ల అనేక మానసిక సమస్యలు తలెత్తాయి. నిత్యం వైద్య సంరక్షణ అవసరమైన క్యాన్సర్, మధుమేహం, టిబి, నరాల సమస్యలున్న రోగులనూ, ఇంకా ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న వారినీ పట్టించుకోవడం లేదు. గర్భిణీ స్త్రీలకూ, ఇతర గర్భస్త సమస్యలకూ సమయాన్ని బట్టి ఎప్పటికప్పుడు వైద్య సంరక్షణ అవసరం. కాని వారిని పట్టించుకోకపోవడం వల్ల తీవ్రమైన కృంగుబాటులోకి పోతున్నారు. దీని వల్ల ప్రజల ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారి పోతోంది. మహమ్మారి సమయంలో వారి పరిస్థితి మరీ దారుణంగా తయారైంది.

ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్యం మీద ఖర్చులు పెంచాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఇది జిడిపిలో 1 శాతం మాత్రమే ఉంది. దాన్ని కనీసం జిడిపిలో 3 శాతానికి పెంచి సార్వత్రిక ప్రజారోగ్య వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

## సిపిఐ(ఎం) ప్రత్యామ్నాయ ఆర్థిక రోడ్‌మ్యాప్

ప్రస్తుత పరిస్థితుల్లో (మే 2, 2020) అనుసరించాల్సిన ఆర్థిక రోడ్‌మ్యాప్ కోసం పార్టీ తన సూచనలను బహిరంగంగా ప్రకటించింది: "ప్రభుత్వం వెనువెంటనే అమలు చేయాల్సిన ఒక ఆర్థిక ప్రణాళికను మేము వెలువరిస్తున్నాం. ఆర్థిక సంక్షోభం, దాని వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తీర్చడానికి తక్షణ చర్యలు, మధ్య కాలిక చర్యలు, దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలి. అయితే ఈ మూడింటినీ ఇప్పుడే ప్రారంభించాలి" అని సూచించింది. ఈ రోడ్‌మ్యాప్‌ను రాష్ట్రపతికీ, ప్రధాన మంత్రికీ, ప్రతిపక్ష పార్టీల నాయకులకూ పంపించాం.

ఇప్పటికే మాంద్యంలోకి ప్రవేశిస్తున్న భారత ఆర్థిక వ్యవస్థను పట్టిపీడిస్తున్న మౌలిక సమస్య దేశీయ గిరాకీ బాగా తగ్గిపోవడమేనని ఈ రోడ్‌మ్యాప్ సరిగ్గా అంచనా వేసింది. ప్రజల వద్ద కొనుగోలు శక్తి ఎంతగా తగ్గిపోయిందంటే ఈ మేరకు గిరాకీ పడిపోవడం వల్ల అన్ని రంగాల్లో పరిశ్రమలు మూతపడి మహమ్మారికి ముందే పెద్ద ఎత్తున నిరుద్యోగం ఏర్పడింది. జాతీయ లాక్‌డౌన్ సందర్భంగా పరిస్థితి మరింత విషమించింది. అందువల్ల తక్షణ, మధ్య కాలిక, దీర్ఘ కాలిక ఆర్థిక ప్రణాళిక ఏదైనా ప్రజల కొనుగోలు శక్తిని పెంచేవిధంగా, ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేట్లుగా ఉండాలి.

గతంలోనే చెప్పినట్లు నయాఉదారవాద ఎజెండాను గట్టిగా అనుసరిస్తున్న రాష్ట్రపతిగానీ, ప్రధాన మంత్రిగానీ మేము లేవనెత్తిన అంశాలను పరిశీలించడం మాట అటుంచి కనీసం రోడ్‌మ్యాప్ అందినట్లు కూడా సమాధానం ఇవ్వలేదు.

### విద్య: తిరోగమన నిర్ణయాలు

మహమ్మారి, లాక్‌డౌన్ పరిస్థితిని ఉపయోగించుకుని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివాదాస్పదమైన, విషతుల్యమైన నూతన విద్యా విధానాన్ని బలవంతంగా అమలుచేయడానికి పూనుకుంది. ప్రతిపక్షం నుండి, దేశంలోని విద్యావేత్తలు, విద్యార్థులనుండి వస్తున్న వ్యతిరేకతను అది లెక్క చేయడం లేదు.

**ఆన్‌లైన్ పరీక్షలు:** విద్యా సంవత్సరం ముగింపుకు వస్తున్న దశలో, కొత్త విద్యా సంవత్సరానికి ప్రవేశాలు జరుగుతున్న దశలో లాక్‌డౌన్ విధించారు. ఒక ప్రణాళికంటూ లేకుండా ఏకపక్షంగా విధించిన లాక్‌డౌన్ దేశం మొత్తం మీద పరీక్షల

క్రమాన్ని దెబ్బతీసింది. ఈ పరిస్థితిని అధిగమించడం కోసం ప్రస్తుత ఆంక్షల వల్ల ఎక్కడైతే నేరుగా పరీక్షలు నిర్వహించడానికి అవకాశం లేదో అక్కడల్లా ప్రభుత్వం యుజిసి ద్వారా ఆన్‌లైన్–ఓపెన్ బుక్ పరీక్షలు నిర్వహించడానికి ఏకపక్షంగా పూనుకున్నది. దీన్ని ఆమోదించకూడదు. ఇప్పటికీ దేశంలో ఇంటర్నెట్ కనెక్టివిటీ 36 శాతం మాత్రమే ఉంది. మన విద్యార్థుల్లో పెద్ద మెజారిటీకి ఆన్‌లైన్ క్లాసులకు గానీ, పరీక్షలకు గానీ ఇంటర్నెట్ అందుబాటులో ఉండదు. ముఖ్యంగా దేశంలో వెనుకబడిన, మారుమూల డిజిటల్ కనెక్టివిటీ లేని చోట నివసించే విద్యార్థులకు అందుబాటులో ఉండదు. అందువల్ల యుజిసి ఇచ్చిన ఈ ఆదేశాలు పూర్తిగా వివక్షతో కూడినవి. అందువల్ల వీటిని ఆమోదించకూడదు.

విద్య మన రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వాలను, యూనివర్శిటీలు–కళాశాలలనూ సంప్రదించకుండా అంతటికీ వర్తించే అటువంటి ఆదేశాలను యుజిసి జారీ చేయగూడదు. ఎందుకంటే బోధనకూ, పరీక్షల నిర్వహణకూ ఇవి విభిన్నమైన పద్ధతులనూ–వ్యవస్థలనూ అమలు చేస్తుంటాయి. అందులోనూ ఉపాధ్యాయ ప్రతినిధులతో, మరీ ముఖ్యంగా ఎవరి భవిష్యత్తయితే వీటితో ముడిపడి ఉందో ఆ విద్యార్థి ప్రతినిధులతో సంప్రదించడం చాలా అవసరం.

చాలా విశ్వవిద్యాలయాలకు అనేక అఫిలియేటెడ్ కళాశాలలు అనుబంధంగా ఉంటాయి. అవి అనేక చోట్ల విస్తరించి ఉంటాయి. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న తరుణంలో, లాక్‌డౌన్ ఆంక్షల కాలంలో చాలా మంది విద్యార్థులకు ఇంటర్నెట్ అందుబాటులో ఉండదు. అందువల్ల వారు ఆన్‌లైన్ విద్య–పరీక్షలకు హాజరు కాలేరు.

అస్థిర పరిస్థితులు, పట్టించుకోని అధికారుల ధోరణుల వల్ల విద్యార్థులు ప్రస్తుతం తీవ్రమైన మానసిక వేదనకు గురవుతున్నారు. ఈ ఆన్‌లైన్ పరీక్షల మందు వారి వేదనను మరింత పెంచుతుంది. ఇప్పటికే ఆన్‌లైన్ తరగతులకు హాజరుకాలేని విద్యార్థులు ఆత్మహత్యలతో జీవితాలను అంతం చేసుకుంటున్న ఘటనలు జరుగుతున్నాయి.

మన విద్యా వ్యవస్థలో డిజిటల్ అంతరాలను అంగీకరించరాదు. అయితే ఫైనల్ ఇయర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి డిగ్రీలు ఇవ్వాలి కాబట్టి, దాని వల్ల వారు ముందు ముందు కెరీర్ ఎంచుకుంటారు

కాబట్టి ఇప్పటికే పరీక్షలు జరిగిన సెమిష్టర్‌లలో వచ్చిన మార్కుల ఆధారంగా వారికి డిగ్రీలు మంజూరు చేయవచ్చు.

**హిందుత్వ ఎజెండాకు అనుగుణంగా సిలబస్ మార్పు:** 9, 10 తరగతుల కోర్సుల నుండి పౌరసత్వం, జాతీయవాదం, లౌకికతత్వం, ఫెడరలిజం ఇంకా మన రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలకు చెందిన కీలకమైన చాప్టర్లను తొలగించాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎగ్జామినేషన్ (సిబిఎస్‌సి) నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత కరోనా మహమ్మారి, లాక్‌డౌన్ నిబంధనలను సాకుగా తీసుకుని విద్యార్థులకు సిలబస్ తగ్గిస్తున్నామన్న పేరుతో సిబిఎస్‌సి ఈ ఏకపక్ష నిర్ణయం తీసుకుంది.

రాజ్యాంగ విలువలను నీరుగార్చేందుకు, భారత దేశ లౌకిక ప్రజాతంత్ర భవిష్యత్తుకు నష్టం కలిగించేందుకు ఈ విధంగా ఎంపిక చేసిన చాప్టర్లను తొలగించారు. దీన్ని తిరస్కరించాలి. ఈ చాప్టర్లు తొలగించడానికి సహేతుకమైన కారణాలను సిబిఎస్‌ఇ చెప్పలేకపోతున్నది. అందువల్ల ఇది దురుద్దేశ పూరిత చర్య.

సిబిఎస్‌ఇ తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి. మన రాజ్యాంగ మౌలిక సూత్రాలను వమ్ముచేసే చర్య ఏదీ ఆమోదయోగ్యం కాదు.

ఆర్ఎస్ఎస్ ఫాసిస్ట్ ఎజెండా అయిన 'హిందూ రాష్ట్ర'ను ముందుకు తీసుకుపోయేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రతిఘటించేందుకు మేధావుల్లోని వివిధ సెక్షన్లను, విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రజాతంత్ర సంస్థలు, విద్యతో సంబంధం ఉన్న సెక్షన్లు, శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందించేందుకు కృషి చేసేవారినీ సమీకరించడానికి పార్టీ అన్ని విధాలా కృషి చేయాలి.

## పోస్టల్ బ్యాలెట్‌పై ఎన్నికల సంఘం ఏకపక్ష నిర్ణయం

65 సంవత్సరాలు అంతకన్నా ఎక్కువ వయసున్న వ్యక్తులు ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోడానికి అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కోవిడ్ మహమ్మారి పరిస్థితిని ఉపయోగించుకుని ఈ పని చేయడమే కాకుండా కోవిడ్ పాజిటివ్ వచ్చిన వారూ, అనుమానం ఉన్న వారిని కూడా ఈ జాబితాలో చేర్చింది.

ఎన్నికల క్రమంలో ముఖ్యమైన పాత్రదారులైన ఏ రాజకీయ పార్టీనీ

సంప్రదించకుండా ఈ నిర్ణయం తీసుకుంది. రాజకీయ పార్టీలు తాము ప్రాతినిధ్యం వహించే ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబిస్తాయి. ఇటువంటి ఏకపక్ష నిర్ణయాన్ని అనుమతించకూడదు.

పోస్టల్ బ్యాలెట్‌ను పెద్ద ఎత్తున తొత్తడం చేయడానికి అవకాశం ఉందని గత అనుభవాలు, అంతర్జాతీయ అనుభవాలు కూడా చెబుతున్నాయి. మామూలుగా ఓటు వేసే వారిలో మూడోవంతు మంది సీనియర్ సిటిజన్లు ఉంటారు. అందువల్ల ఎన్నికల ఫలితాలను తొత్తడం చేసి తారుమారు గావించడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

వివిధ ప్రతిపక్ష పార్టీలు నిరసన తెలియజేసిన తరువాత ఎన్నికల సంఘం దీని అమలును నిలిపివేసింది.

మహమ్మారి పరిస్థితుల్లో ఎన్నికలు జరిగితే ఎన్నికల ప్రచారానికి సరైన పరిస్థితులు ఉంటేట్లు, అందరికీ సమానావకాశాలు ఉండేట్లు చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిది. సీనియర్ సిటిజన్‌లకూ, కోవిడ్ సోకిన వారికీ అన్ని రకాల రక్షణలతో అదే పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేయాలి.

**బీహార్ శాసనసభ ఎన్నికలు**: బీహార్ ప్రజల, దేశ ప్రజల ప్రయోజనాలు కాపాడబడాలంటే ఆ రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో బిజెపి–జెడి(యు) కూటమి ఓడిపోవడం అవసరం. ఈ లక్ష్య సాధన కోసం పనిచేసే అన్ని ఇతర శక్తులతో వామపక్షాలు సహకరిస్తాయని అక్కడ రాష్ట్ర స్థాయి పార్టీలయిన సిపిఐ(ఎం), సిపిఐ, సిపిఐ(ఎంఎల్) ఉమ్మడిగా ప్రకటించాయి.

ఈ ఎన్నికలకు బిజెపి ఇప్పటికే పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తోంది. దాని దగ్గర ఉన్న అన్ని వనరులను ఉపయోగించుకుని భారీగా డిజిటల్ ప్రచారాన్ని ప్రారంభించింది.

ఈ ఎన్నికలను పూర్తిగా డిజిటల్ ప్రచారం, డిజిటల్ ఓటింగ్ ద్వారా నిర్వహించాలన్న ఎన్నికల సంఘం ప్రతిపాదనను బిజెపి, జెడి(యు) బలపరిచాయి. సిపిఐ(ఎం), వామపక్షాలు వ్యతిరేకించాయి. దీనివల్ల అనేక మంది ఎన్నికల్లో పాల్గనలేకపోతారు. ఇది ప్రజాస్వామ్యాన్ని వమ్ము చేస్తుంది. ఇటువంటి క్యాంపెయిన్ పద్ధతుల వల్ల ఎన్నికలను పెద్ద ఎత్తున తొత్తడం చేయడానికి అవకాశముందని అంతర్జాతీయ అనుభవాలు చెబుతున్నాయి. ఇది ప్రజాభిప్రాయాన్ని వక్రీకరిస్తుంది.

ఎన్నికలు సక్రమంగా జరగడానికి కావలసిన పరిస్థితులు ఉండేట్లు చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే. సరైన ప్రచార పద్ధతులు అమలు చేసి, ప్రజలు భౌతికంగా ఓటువేసేట్లు చూడ్డం ద్వారా అందరికీ సమానావకాశాలు ఉండేట్లు  చూడాలి.

కరోనా  మహమ్మారి ఉధృతమవుతున్న పరిస్థితుల్లో ప్రజల భద్రతకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత, ఎన్నికలు సాధారణ పరిస్థితుల్లో జరిగినట్లు రుజువు చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం మీద, పరిపాలనా యంత్రాంగం మీదా ఉంది.

ఎన్నికల్లో ధనబలాన్ని ఉపయోగించుకునే అలవాటు బిజెపికి ఉన్నందున ఎన్నికల సంఘం, సుప్రీం కోర్టు ముందు ఎన్నికల బాండ్ల వల్ల వచ్చే ప్రమాదాల గురించి వివరించాలి. వాటి వల్ల ప్రజాస్వామిక ఎన్నికల క్రమం ఎలా వక్రీకరించబడుతున్నదో, ప్రజలు స్వేచ్ఛగా ఎన్నికల్లో ఎలా పాల్గనలేకపోతున్నారో తెలియజేయాలి. ఈ ఎన్నికల బాండ్లను రద్దు చేయాలి, భవిష్యత్తులో ఎన్నికల ముందు వీటిని జారీ చేయడానికి అనుమతివ్వ కూడదు.

**జమ్మూ - కాశ్మీర్**

జాతీయ లాక్‌డౌన్ కన్నా ముందుగానే గత ఏడాది ఆగస్టులో జమ్మూకాశ్మీర్‌లో రాజకీయ లాక్‌డౌన్ ప్రకటించారు. మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీతో సహా వందలాది మంది నిరంకుశ ప్రజా భద్రతా చట్టం కింద ఇప్పటికీ నిర్బంధంలో ఉన్నారు. సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు మొహమ్మద్ యూసుఫ్ తరిగామితో సహా అనేక మందిని గృహ నిర్బంధంలో ఉంచారు. ఇటీవలి మాసాల్లో నిర్బంధం నుండి విడిచి పెట్టిన వారిని కూడా ఇళ్లనుండి బయటకు వెళ్లడానికీ, ఇతరులను కలవడానికీ అనుమతివ్వడం లేదు. ఎటువంటి అధికారిక ఆదేశాలు లేకుండా వీరిని గృహనిర్బంధంలో ఉంచడం రాజ్యాంగ హక్కులనూ, హామీలనూ ఉల్లంఘించడమే.

కరోనా ప్రారంభమై, లాక్‌డౌన్ విధించినప్పటి నుండి జమ్మూకాశ్మీర్‌లో కరోనా పాజిటివ్ కేసులు క్రమంగా పెరుగుతూ ఉన్నాయి. రాష్ట్రంలో ఆరోగ్య సదుపాయాలు ఘోరంగా ఉన్నాయి. బాధిత ప్రజలకు ఎటువంటి సహాయ చర్యలూ తీసుకోవడం లేదు. ఇప్పటికే విచ్ఛిన్నమైన జీవితాలు మరింత దుర్భరంగా మారుతున్నాయి.

**శాశ్వత నివాస ప్రాంత (డొమిసిల్) నిర్వచనం మార్పు:** జమ్మూ-కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంత వ్యవహారాలు నేరుగా చూస్తున్న కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ ఈ కీలక సమస్యలను పరిష్కరించకుండా ఆర్ఎస్ఎస్-బిజెపి  రాజకీయ ఎజెండాను

ముందుకు తీసుకుపోడానికి ప్రయత్నిస్తోంది. జమ్మూ-కాశ్మీర్ శాశ్వత నివాస ప్రాంత (డొమిసిల్) నిర్వచనాన్ని మార్చేసి బయటి నుండి వచ్చే ఇతరులు కూడా ఈ ప్రాంతంలో శాశ్వత నివాస ప్రతిపత్తి పొందడానికి అనుమతిస్తున్నారు. అంటే బయటి నుండి వచ్చేవారు కూడా ఈ ప్రాంతంలో ఉద్యోగాలు పొందవచ్చు, భూములు, ఆస్తులు కొనుగోలు చేయవచ్చు. ఈ లోయలో జనాభా నిష్పత్తిని మార్చేయాలన్న ఆర్ఎస్ఎస్ ఎజెండాలో ఇది భాగం. దీనితోపాటు ప్రజల ప్రజాతంత్ర హక్కులనూ, పౌరహక్కులనూ తీవ్రంగా కాలరాస్తున్నారు. అసమ్మతి తెలిపే వారినందరినీ ఉగ్రవాదులుగా ముద్ర వేసి నిరంకుశ నిబంధనలు ప్రయోగిస్తున్నారు.

**నిరంకుశ మీడియా విధానం:** భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛను కాలరాసే విధంగా కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ జమ్మూ-కాశ్మీర్‌కు కొత్త మీడియా విధానాన్ని ప్రకటించింది. ఇకనుండి మీడియా వ్యక్తులు ఎటువంటి వార్తలు ఇవ్వాలన్నా అధికారులు, భద్రతా దళాల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఏ వార్తలు "తప్పుడు వార్తలు, అనైతికమైనవి, ఇతరులవద్ద తస్కరించబడినవి" లేక "జాతి వ్యతిరేకమైనవి" అన్న విషయాన్ని నిర్ణయించే అధికారం వారికి అప్పగించబడింది. 2019 ఆగస్టు 5 నుండి పాత్రికేయులపై ఏ నిషేధాలైతే అమలవుతున్నాయో వాటిని ఈ కొత్త మీడియా విధానం చట్టబద్దం చేసింది. ఈ మీడియా విధానాన్ని ఉపసంహరించాలి, పాత్రికేయులను వేధించడం వెంటనే ఆపాలి.

370వ అధికరణంతో సహా జమ్మూకాశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలి. జమ్మూకాశ్మీర్ భారత్‌లో విలీనమైనప్పుడు ఆ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నిటినీ అమలు పరచాలి. ఈ విషయం ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఉంది. పదకొండు మాసాలు అయినప్పటికీ కోర్టు దీన్ని విచారణకు తీసుకోకపోవడం నష్టం కలిగించే అంశం.

2019 ఆగస్టు తరువాత నిర్బంధించిన వారందరినీ తక్షణం విడుదల చేయాలి. సమాచార సంబంధాలను పూర్తిగా పునరుద్ధరించాలి. ప్రజలు స్వేచ్ఛగా తిరిగేందుకు అనుమతించాలి. కరోనా వైరస్‌ను సమర్ధవంతంగా కట్టడి చేయడానికీ, ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు సహాయం అందించడానికి ఇది చాలా అవసరం.

**ఆర్ఎస్ఎస్ బిజెపి ఎజెండా ఉధృతంగా అమలు:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్ధిక మాంద్యాన్ని పరిష్కరించడం, రోజురోజుకూ దిగజారిపోతున్న పరిస్థితులనుండి

ప్రజలకు వెసులుబాటు కల్పించడానికి బదులు.. నయాఉదారవాద ఆర్థిక సంస్కరణలను తీవ్రంగా అమలుపరచడంతో పాటు, తన పచ్చి హిందూత్వ ఎజెండాను ముందుకు తీసుకుపోడానికి ఈ కరోనా మహమ్మారినీ, లాక్‌డౌన్ పరిస్థితినీ ఉపయోగించుకుంటోంది.

**మొదటిది,** బిజెపి ప్రభుత్వం నయాఉదారవాద ఆర్థిక సంస్కరణలను మరింత ఉధృతంగా అమలు చేస్తోంది. **భారత స్వావలంబన పేరుతో ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీ నిజానికి దేశాన్ని విదేశీ, స్వదేశీ ప్రయివేటు పెట్టుబడికి దాసోహం చేసేదే.**

**క్రూరమైన ప్రయివేటీకరణ :** మన దేశంలో రక్షణ ఉత్పత్తులు, అణు ఇంధనం, ఇతర అన్ని వ్యూహాత్మక రంగాలతో సహా అన్ని రంగాలనూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డిఐ) తలుపులు తెరిచారు. అత్యధిక ప్రభుత్వ రంగ సంస్థలను ముఖ్యంగా భారతీయ రైల్వేలు, విద్యుత్తు, పెట్రోలియం, బొగ్గు, బ్యాంకులు–ఇన్స్యూరెన్స్, రక్షణ ఉత్పత్తులు మొదలైన వాటిని ప్రయివేటీకరిస్తున్నారు. ఇది మన జాతీయ సంపదను పూర్తిగా దోచుకోవడమే. లాభాల గరిష్టీకరణకు ఇది ఒక రాచమార్గం. దీనర్థం కార్మిక ప్రజలపై దోపిడీని తీవ్రతరం చేయడమే. ఇది గత ఆరు సంవత్సరాలుగా ఈ ప్రభుత్వం కింద జరుగుతున్న ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ పెరుగుదలను మరింత ప్రమాదకరమైన స్థాయికి తీసుకుపోవడమే.

**కార్మికవర్గ వ్యతిరేకత:** కార్మికులపై దోపిడీని తీవ్రతరం చేసేందుకుగాను 8 గంటల పనిదినంతో సహా కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తున్నారు. కార్మిక చట్టాలను సస్పెండ్ చేయడమో లేక బలహీన పరచడమో చేస్తూ కనీసం 13 రాష్ట్రాలు నోటిఫికేషన్లు జారీ చేశాయి. అనేక రాష్ట్రాల్లో పని గంటలను 8 నుండి 12కు పెంచారు. ఈ విధంగా బిజెపి కేంద్ర ప్రభుత్వం ఒకవైపు జాతీయ సంపదను పూర్తిగా లూటీ చేసే విధానాలనూ, మరోవైపు కార్మికులపై తీవ్రంగా దాడి చేసే కార్మిక వ్యతిరేక విధానాలనూ అమలు చేస్తోంది.

**కార్మికుల చట్టబద్ధ హక్కులమీద జరుగుతున్న దాడి మోడీ ప్రభుత్వ కార్మికవర్గ వ్యతిరేక, శ్రామిక ప్రజల వ్యతిరేక లక్షణాన్ని ప్రతిబింబిస్తోంది.**

**రెండవది,** ఈ కాలంలో ప్రభుత్వ మద్దతు, రక్షణతో ఆర్‌ఎస్‌ఎస్ బిజెపిలు ముస్లిం మత మైనారిటీ ప్రజలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం, మతపరమైన విభజన సృష్టించడం ముమ్మరం చేశారు.

సిఎఎ ఎన్ఆర్సి ఎన్పిఆర్ లకు వ్యతిరేకంగా శాంతియుత నిరసన ప్రదర్శన చేసిన అనేక మంది యువ కార్యకర్తలను, ఇతరులను లక్ష్యంగా చేసుకుని నిరంకుశ నిబంధనల కింద అరెస్టు చేశారు. కేంద్ర హెూమ్ మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్న ఢిల్లీ పోలీసులు వాస్తవాలను వక్రీకరించి మరీ సిఎఎ వ్యతిరేక నిరసనల్లో పాల్గన్న జమియా మిఇయా యూనివర్శిటీ, జెఎన్యు విద్యార్థులను అరెస్టు చేశారు. ఢిల్లీ పోలీసులు జమియా మిలియా యూనివర్శిటీ లైబ్రరీలోకీ, హాస్టళ్లలోకీ ఎలా ప్రవేశించిందీ, ఎలా ఆవరణలను ధ్వంసం చేసిందీ, విద్యార్థులను అమానుషంగా కొట్టిందీ వీడియోలతో సహా సోషల్ మీడియాలో ప్రసారం అయింది. ఇలా పోలీసు టెర్రర్కు గురయిన బాధితుల మీదనే ఇప్పుడు కేసులు పెట్టి, అరెస్టు చేశారు. సిఎఎ వ్యతిరేక ఉద్యమకారుల మీదా, మానవ హక్కుల కార్యకర్తలమీదా, ఈ శాంతియుత నిరసనలను సమర్థించిన వారందరిమీదా తప్పుడు కేసులు పెట్టి అరెస్టులు చేశారు. ఢిల్లీ పోలీసులు, కేంద్ర హెూమ్ మంత్రి పక్షపాత వైఖరిని ఎండగట్టి, వ్యతిరేకించిన వారందరి మీదా తప్పుడు ఎఫ్ఐఆర్లు నమోదు చేశారు. అదేసమయంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై దాడులకు పాల్పడిన వారు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. కేంద్ర మంత్రులతో సహా పచ్చి విద్వేష ఉపన్యాసాలు చేసిన బిజెపి నాయకులను ఏమీ చేయకుండా వదిలేశారు. ఢిల్లీ హైకోర్టుకు ఢిల్లీ మైనారిటీ కమిషన్ సమర్పించిన అఫిడవిట్లో ఢిల్లీ మతఘర్షణల్లో మైనారిటీలపై ఏ విధంగా దాడులకు పాల్పడ్డారో తెలిపే దారుణమైన విషయాలనూ, వాటిలో పోలిసుల పాత్రనూ పూసగుచ్చినట్లు వివరించారు.

ఫిబ్రవరిలో జరిగిన మత హింసపై జరిగిన దర్యాప్తు నివేదికను ఢిల్లీ పోలీసులు జూలై 13న ఢిల్లీ హైకోర్టుకు సమర్పించారు. పోలీసులు ఎంత దారుణమైన మతపరమైన వివక్షతో దర్యాప్తు చేసారో ఇది మరోమారు తెలిపింది. రాజకీయ నాయకులపై "ఇంతవరకు చర్యలు తీసుకోదగ్గ నేరాలేవీ బయటపడలేదు" వారు ఈశాన్య ఢిల్లీ మతఘర్షణలను "ప్రేరేపించినట్లు గానీ లేక వాటిలో పాల్గన్నట్లు గానీ" ఆధారాలు లేవు అని ఢిల్లీ పోలీసులు హైకోర్టుకు తెలిపారు. కేంద్ర క్యాబినెట్ మంత్రితో సహా అనేక మంది ప్రముఖ బిజెపి నాయకులు ప్రజలను హింసకు రెచ్చగొడుతూ చేసిన ఉపన్యాసాలు సోషల్ మీడియాలో ఎంతో పెద్ద ఎత్తున ప్రసారం అయినా ఈ విధంగా తెలపడం అంటే వీడియోలతో సహా అన్ని రకాల ఆధారాలనూ తొత్తడం చేయడమే అవుతుంది. ఇది పూర్తిగా మసిపూసి మారేడుకాయ చేసే పనే. పోలీసుల దౌర్జన్యానికి

సంబంధించిన వీడియోలతో సహా అన్ని ఆధారాలున్నప్పటికీ పోలీసులు సమర్పించిన అఫిడవిట్‌లో "ఈ విషయంలో పోలీసులెవరూ జోక్యం చేసుకోలేదు" అని పేర్కొన్నారు. ఈ హింసా కాండకు సంబంధించి 751 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. కానీ వాటిని బయట పెట్టడానికి నిరాకరించారు. ఈ 751 ఎఫ్ఐఆర్‌లలో 200 ఛార్జి షీట్లు మాత్రమే ఫైల్ చేశారు. ఇది కూడా మరో మసిపూసి మారేడుకాయ చేసే పనే.

ఈ ఘర్షణల్లో చనిపోయిన 53 మందిలో 40 మంది ముస్లింలని ఈ రిపోర్టు తెలిపింది. గాయపడిన 473 మంది పౌరుల్లో 185 మంది హిందువులు. 108 మంది పోలీసులు గాయపడ్డారు. ఆస్తులకు నష్టం జరిగిన విషయాలను పరిశీలిస్తే.. 50 ముస్లింల ఇళ్లు, 14 హిందువుల ఇళ్లు, షాపుల్లో ముస్లింలవి173, హిందువులవి 42, ప్రార్థనా ప్రదేశాల్లో  13 మసీదులు, 6 దేవాలయాలు ఉన్నట్లు తెలిపింది. 1,430 మందిని అరెస్టు చేసినట్లు, 751 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు, 14 మందిని యుఎపిఎ చట్టం కింద అరెస్టు చేసినట్లు తెలిపింది. ఈ మొత్తంలో ముస్లిం మైనారిటీలకు సంబంధించి జరిగిన ప్రాణ, ఆస్తి నష్టాన్ని తక్కువ అంచనా వేశారు.

సిఎఎ వ్యతిరేక నిరసనకారులపై ఉత్తర ప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం కేసులు పెట్టిన తీరును పరిశీలిస్తే మతపరమైన ఏరివేత ఎలా ఉందో స్పష్టంగా అర్థమవుతుంది. మార్చిలో ఈ రాష్ట్రంలో 'ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ ఆస్తుల విధ్వంస రికవరీ  ఆర్డినెన్స్ 2020' పేరుతో ఒక నిరంకుశ చట్టాన్ని తెచ్చారు. ఈ చట్టం కింద ప్రభుత్వం ఏ వ్యక్తినైనా ఆస్తులకు నష్టం చేకూర్చారని ప్రకటించి ఈ నేరానికి గాను వారి నుండి విపరీతమైన జరిమానాలు వసూలు చేయవచ్చు. జరిమానాలు కట్టకపోతే వారి ఆస్తులు జప్తు చేయవచ్చు. ఈ చట్టం కింద ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్‌కు వచ్చిన ఫిర్యాదులపై అది ఇచ్చిన తీర్పులు అంతిమమైనవి. వాటిపై ఏ కోర్టులోనూ సవాలు చేసే అధికారం లేదు. సిఎఎ వ్యతిరేక నిరసన కారులపై యుపి పోలీసులు ఎంత అమానుషంగా ప్రవర్తించారో అందరికీ తెలుసు. దేశ ద్రోహ నేరం కింద వందలాదిమందిని ఎటువంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేశారు. ఆలీఘర్ ముస్లిం యూనివర్సిటీని లక్ష్యంగా చేసుకుని అనేక మంది మేధావులపైనా, మానవహక్కుల కార్యకర్తలపైనా దాడి చేసి, తదుపరి అరెస్టు చేశారు. సిఎఎ వ్యతిరేక నిరసన కారుల్లో ముఖ్యుల పేర్లను వారి అడ్రసులతో సహా బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శనకు పెట్టారు. వారిపై ఎవరైనా ప్రతీకార

దాడులు చేయవచ్చునని రెచ్చగొట్టడానికి ఈ పని చేశారు. ఈ నిరంకుశ చట్టం కింద ముస్లింలను, ముఖ్యంగా పేదలను లక్ష్యం చేసుకున్నారు. ఒక రిక్షా తొక్కే వ్యక్తికి రూ. 2 లక్షలు జరీమానా వేశారు. దాన్ని కట్టలేకపోవడంతో జైలులో పెట్టారు. మైనారిటీ మతస్తులపై సాగే ఈ దమనకాండను అడ్డుకునే వేదికే లేదు.

ఆగస్టు 5న అయోధ్యలో మందిర నిర్మాణానికి ప్రకటించిన 'భూమి పూజ' కార్యక్రమంలో మరోసారి మతవిద్వేషాలు రెచ్చగొట్టి మతవిభజనకు దారితీసే ప్రమాదం ఉంది.

**మూడవది,** అసమ్మతి గళాలన్నిటినీ, ప్రజాస్వామ్య హక్కులు, పౌరహక్కుల కోసం, మైనారిటీలు, బలహీన వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడేవారందరినీ దేశద్రోహం చట్టం, యుఎపిఎ, ఎన్ఎస్ఎ వంటి నిరంకుశ చట్టాల కింద అరెస్టు చేసి జైల్లో పెడుతున్నారు.

భీమా కొరెగాం కేసు విషయంలో హింసను ప్రేరేపించిన ఆర్ఎస్ఎస్‌ను రక్షించడం కోసం గత బిజెపి రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు కేసు పెట్టింది. తరువాత మహరాష్ట్రలో అధికారంలోకి వచ్చిన సంకీర్ణ ప్రభుత్వం ఈ కేసుపై పునరాలోచించింది. దాంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బలవంతంగా ఈ కేసును ఎన్ఐఎ కింద స్వాధీనపరుచుకుంది. ప్రజాస్వామిక హక్కులు, పౌర హక్కుల కోసం పోరాడే 11 మంది కార్యకర్తలు పస్తుతం జైల్లో ఉన్నారు. జైళ్లలో కరోనా వ్యాపించింది. కార్యకర్తల ఆరోగ్య పరిస్థితి బాగా లేదు. అయినా ఆరోగ్య ప్రాతిపదికపై బెయిల్ కోసం పెట్టుకున్న దరఖాస్తులను కనీసం పరిశీలనకు కూడా చేపట్టకుండా ప్రభుత్వం చూస్తోంది.

మీడియాలో అధికార పంథాకు జీహుజూర్ అనడానికి నిరాకరించే పాత్రికేయులు కొద్ది మందే ఉన్నారు. వారిపై కక్షసాధిస్తున్నారు, వేధిస్తున్నారు. మరోవైపు పాలక పార్టీకి భజన చేసే పాత్రికేయులను అన్ని విధాల రక్షిస్తూ, నజరానాలిస్తున్నారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వార్తలిచ్చే చాలా మంది జర్నస్టులపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారు, వేధిస్తున్నారు, అరెస్టు చేస్తున్నారు. ఈ ప్రభుత్వం తప్పుడు వార్తలను ప్రోత్సహిస్తోంది, నిజాలు రాసేవారిని శిక్షలకు గురిచేస్తోంది.

హేతువాదుల మీద, శాస్త్రీ దృక్పథాన్ని ప్రచారం చేసేవారి మీద ఛాందసవాదులు దాడులు చేస్తున్నారు. వీరికి ప్రభుత్వ మద్దతు లభిస్తోంది. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని

పెంపొందించాల్సిందిపోయి ఆర్‌ఎస్‌ఎస్‌–బిజెపిలు తమ హిందూత్వ ఎజెండాను ముందుకు తీసుకుపోడానికి ఛాందసవాదాన్ని, మూఢనమ్మకాలనూ పెంపొందిస్తున్నారు.

**నాల్గవది,** కేంద్ర ప్రభుత్వం ఈ లాక్‌డౌన్ కాలాన్ని ఉపయోగించుకుని అన్ని రకాల అధికారాలను తన గుప్పిట్లోకి తీసుకుంది. ఆ విధంగా అది మన రాజ్యాంగానికి మూల సూత్రమైన ఫెడరలిజాన్నీ, ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల హక్కులనూ వమ్ము చేసింది. నిఘా ఆధారంగా నడిచే 'భద్రతా రాజ్యం' నెలకొల్పడం, ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు ప్రాజెక్టును సాకారం చేయడం అనే లక్ష్యాలు నెరవేర్చడం కోసమే బిజెపి ప్రభుత్వం ఈ విధంగా ఏకీకృత రాజ్యాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తోంది. అన్ని నిర్ణయాలను ప్రధాన మంత్రి, కేంద్ర ప్రభుత్వం తీసుకుంటాయి. ఈ ఏకపక్ష నిర్ణయాలను అమలు చేసే భారం రాష్ట్రాల మీద పడుతుంది.

కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వాలు ముందుండి పోరాడుతున్నాయి. వారి సామర్థ్యాన్ని పెంచేందుకు తగిన నిధులు కేటాయించడం మాట అటుంచి కనీసం వారికి రావలసిన జిఎస్‌టి బకాయిలు కూడా ఇవ్వడం లేదు. రాష్ట్రాలు అప్పుతెచ్చుకునే పరిమితిని జిడిపిలో 3 శాతం నుండి 5 శాతానికి పెంచారు. అయితే, ఈ అప్పులు వాణిజ్య ప్రాతిపదికగా తెచ్చుకోవాల్సి ఉంటుంది. గనుక దీని వల్ల ప్రయోజనం చాలా తక్కువ. ఎందుకంటే వాణిజ్య పరమైన అప్పులకు వడ్డీ రేటు చాలా ఎక్కువ. అందువల్ల అవి అప్పుల ఊబిలో చిక్కుకుంటాయి. ప్రధాన మంత్రి పేరుతో సృష్టించిన ప్రయివేటు ట్రస్టు కింద వసూలు చేసిన వేలాది కోట్ల రూపాయల డబ్బును కేంద్రం వెంటనే రాష్ట్రాలకు అందించాలి.

**అయిదవది,** రాజ్యాంగపరంగా పనిచేసే స్వతంత్ర సంస్థలన్నిటినీ నీరుగార్చేందుకు తీవ్రమైన ప్రయత్నం జరుగుతోంది. పార్లమెంటుకు రాకుండానే చాలా పనులు జరిగిపోతున్నాయి. భారత రాజ్యాంగ కేంద్రంగా పనిచేసే ప్రజల స్వావలంబన అనేది వారు ఎన్నుకున్న ప్రతినిధుల ద్వారా అమలవుతుంది. వీరికి కార్యనిర్వాహక వర్గమైన ప్రభుత్వం బాధ్యత వహించాలి. ఇప్పుడు జరుగుతున్నట్లు పార్లమెంటు పనిని కుంటుపరిస్తే మొత్తం రాజ్యాంగ యంత్రం విచ్ఛిన్నం అవుతుంది. ఇటీవలి సంవత్సరాల్లో న్యాయవ్యవస్థ ఎలా పనిచేస్తున్నదో మనం చూస్తున్నాం. రాజ్యంగంలోని 370, 35ఎ అధికరణాలను రద్దుచేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లు 2019 ఆగస్టు నుండి పెండింగ్‌లో ఉన్నాయి. అదేవిధంగా పౌరసత్వ సవరణ

చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ కూడా పెండింగ్‌లో ఉంది. న్యాయం జరగడంలో ఆలస్యం కావడం అంటే న్యాయం నిరాకరించబడినట్లే. అలాగే ఎన్నికల సంఘం స్వతంత్ర పని కూడా సందేహాస్పదం అయింది. పోస్టల్ బ్యాలెట్‌పై ఇటీవల అది ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం ఒక నిదర్శనం. ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించిన ప్రధాన మంత్రిపైనా, ఇతరులపైనా కేసు బుక్ చేయొద్దన్న నిర్ణయాన్ని వ్యతిరేకించిన ఒక ఎలక్షన్ కమిషనర్‌ను పక్కకు తొలగించడం దీనికి మరో నిదర్శనం. ఆయన వచ్చే ఏడాది కేంద్ర ఎన్నికల కమిషనర్ (సిఇసి) కావలసిన వారు. సిబిఐ అనేది స్వతంత్ర దర్యాప్తు సంస్థ లాగా కాకుండా ప్రభుత్వ రాజకీయ తాబేదారు లాగా పనిచేస్తున్నది. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఇడి) రాజకీయ నాయకుల కనుసన్నల్లో నడుస్తున్నది. ఇవన్నీ కూడా భారత రాజ్యాంగ వ్యవస్థను తీవ్రంగా వమ్ము చేస్తున్నాయి, నియంతృత్వ దాడులను పెంచుతున్నాయి.

**ఆరవది,** దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలపై ఆధిపత్యం సాధించేందుకుగాను రాష్ట్రాల్లో ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోసే నికృష్ట ప్రయత్నాలకు బిజెపి దిగింది. ఆ విధంగా అది ప్రజలిచ్చిన తీర్పులను వమ్ము చేస్తున్నది. ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థద్వారా, ఎన్నికల బాండ్లు, ఇతర అక్రమ పద్దతుల ద్వారా తన దగ్గర చేరిన డబ్బును ఉపయోగించుకుని అది, ఎన్నికైన ప్రజా ప్రతినిధులను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నది. దీనికి తోడు ఇడి, సిబిఐ వగైరా సంస్థలను ఉపయోగించుకుని వేధింపులు, బెదిరింపులతో ప్రతిపక్షాలను లంగదీసుకోడానికి ప్రయత్నిస్తున్నది.

ఇతర పార్టీల నుండి బిజెపిలోకి ఫిరాయించిన వారి తప్పొప్పులేమైనా ఉంటే వారిని రక్షిస్తున్నది (క్రిమినల్ కేసుల విషయంలో కూడా). వారి ఒత్తిడికి లంగని వారిని వేధిస్తున్నది, హింసిస్తున్నది, శిక్షిస్తున్నది.

బిజెపి  ఈ విధంగా చేస్తుంటే ప్రతిపక్ష పార్టీల్లో ముఖ్యంగా ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలు బిజెపికి తోడ్పడుతున్నాయి. మధ్య ప్రదేశ్‌లో ఇవి బిజెపికి సహకరించాయి. ప్రస్తుతం రాజస్థాన్‌లో ప్రయత్నం జరుగుతోంది. ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ ప్రయత్నాలు సాగుతున్నాయి. తనకు మద్దతివ్వని మహరాష్ట్ర, ఝూర్ఖండ్ మొదలైన కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాలను కూడా అది లక్ష్యంగా చేసుకుంటున్నది.  అది మరీ ముఖ్యంగా కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంది.

**కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు**: కేరళలో ఇటీవల యుఎఇ దౌత్యకార్యాలయం నుండి వచ్చిన బ్యాగేజీలో బంగారం అక్రమ రవాణా అవుతున్న కేసు బయటపడింది. దీన్ని ఉపయోగించుకుని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వంపై దాడికి దిగుతున్నారు. ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్, బిజెపిలు డిమాండ్ చేయడమే కాకుండా దాని కోసం ఆందోళన నిర్వహిస్తున్నాయి.

కస్టమ్స్ అధికారులు అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్న ఈ కేసు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి రాదు. కేంద్ర సంస్థతో దర్యాప్తు జరపాలని ముఖ్యమంత్రి కోరారు. ఎన్ఐఎ దీనిపై దర్యాప్తు నిర్వహిస్తోంది. కానీ ఈ కుంభకోణంలో ముఖ్యమంత్రి కార్యాలయం ప్రమేయం ఉందని తప్పుడు ఆరోపణలు చేస్తూ, కాంగ్రెస్, బిజెపిలు ఏకమై ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి ప్రయత్నిస్తున్నాయి. కోవిడ్–19ను అరికట్టడానికి అన్ని శక్తులూ కేంద్రీకరించిన ఈ సమయంలో వాళ్లు చేపట్టిన ఈ విచ్ఛిన్నకర చర్యకు వ్యతిరేకంగా సిపిఐ(ఎం), ఎల్‌డిఎఫ్‌లు ప్రజలను సమీకరిస్తున్నాయి.

**ఏడవది,** ఈ కాలంలో ఏర్పడిన పరిస్థితులను ఉపయోగించుకుని మోడీ, బిజెపి కేంద్ర ప్రభుత్వం భారత దేశాన్ని అమెరికన్ సామ్రాజ్యవాదపు జూనియర్ భాగస్వామి పాత్రవైపు మరింతగా నెట్టారు. అన్ని రంగాల్లోనూ ముఖ్యంగా రక్షణ రంగంలో అమెరికాతో భారత దేశం కుదుర్చుకున్న అనేక ఒప్పందాలను గురించి జనవరి కేంద్ర కమిటీ సమావేశంలో మనం పేర్కొన్నాం. ఈ రోజు చైనాకు వ్యతిరేకంగా అమెరికా చేస్తున్న ప్రచారంలో భారత దేశం అమెరికా అనుకూల వైఖరి తీసుకుంది. ఇది భారత విదేశాంగ విధానం మీద, ముఖ్యంగా మన ఇరుగుపొరుగు దేశాలతో సంబంధాలమీద తీవ్రమైన ప్రభావం కలిగిస్తుంది.

అమెరికా సామ్రాజ్యవాదానికి ఇలా జూనియర్ భాగస్వామిగా మారడం భారత దేశ ప్రయోజనాలకుగానీ, మన ప్రజల ప్రయోజనాలు గాని మంచిది కాదు.

## ఇరుగు పొరుగు దేశాలతో దిగజారిపోతున్న సంబంధాలు

**చైనా:** భారతచైనా సైనిక ప్రతిష్టంభన కాస్తా భౌతిక ఘర్షణలకూ, రెండు వైపులా మరణాలకూ దారి తీసింది. ఇందులో 20 మంది భారత సైనికులు ప్రాణాలు

కోల్పోయారు. భారత్‌చైనా సరిహద్దులోని వాస్తవాధీన రేఖలో ఇటువంటి హింసాత్మక ఘర్షణలు, ప్రాణహాని జరిగడం 45 ఏళ్ల తరువాత ఇదే మొదటి సారి. లడఖ్‌లోని గాల్వన్ లోయలో జరిగి ఈ సంఘటన కొంతకాలంగా కొనసాగిస్తూ వస్తున్న శాంతి, సామరస్యాలకు తీవ్రమైన విఘాతం కలిగించింది. ప్రభుత్వం నిర్వహించిన అఖిలాపార్టీల సమావేశంలో (2020 జూన్19న) సిపిఐ(ఎం), మన సైనికుల మరణం పట్ల తీవ్రమైన సంతాపాన్ని తెలియజేసింది. భారత ప్రభుత్వం అనుసరించిన వైఖరికీ, పంథాకూ మద్దతు తెలిపింది. రెండు దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం తరువాత భారత దేశం విడుదల చేసిన ప్రకటన ఇలా పేర్కొంది: "మొత్తం పరిస్థితిని బాధ్యతాయుతమైన విధంగా పరిష్కరించుకోవాలనీ, జూన్ 6వ తేదీన వచ్చిన సైనిక ఉపసంహరణ అవగాహనను రెండు పక్షాలూ హృదయపూర్వకంగా అమలు పరచాలనీ చర్చల అనంతరం నిర్ణయానికి రావడం జరిగింది. సమస్య తీవ్రమయ్యే విధంగా ఏ పక్షమూ చర్యలు తీసుకోకూడదు. దానికి మారుగా ద్వైపాక్షిక ఒప్పందాలు, ప్రోటోకోల్స్ ప్రకారం శాంతి, సామరస్యం నెలకొనేట్లు చూడాలి."

ఇది జరిగిన తరువాత ఎల్ఏసి వెంబడి స్పష్టమైన సరిహద్దురేఖ ఏర్పాటుకు చర్యలు తీసుకునేవిధంగా భారత ప్రభుత్వం ఉన్నత స్థాయి చర్చలు జరపాలి అని పార్టీ పేర్కొంది. సరిహద్దు రేఖపై స్పష్టత లేనందునే ఇటుంటి వివాదాలు, ప్రతిష్టంభన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సరిహద్దులో శాంతి, సామరస్యాలు ఏర్పడ్డానికిగాను భారత్ చైనా రెండూ ఎల్ఏసిలో సరిహద్దు రేఖపై అంగీకారానికి రావడం అవసరం.

అయితే ఏప్రిల్, జూన్ మాసాల మధ్య ఘర్షణలకు దారితీసిన పరిస్థితులపై ప్రభుత్వం అఖిల–పార్టీల సమావేశంలో వివరణ ఇవ్వలేదు. ఎల్ఏసిలో సరిహద్దు రేఖపై ఒక స్పష్టత వస్తేనే నాడు డోక్లామ్, ఇప్పుడు లడఖ్‌లో వచ్చిన లాంటి వివాదాలు రాకుండా ఆపగలం.

అయితే, భారత భూభాగంలోకి చొరబాటుగానీ, ఎల్ఏసిని దాటడం గానీ జరగలేదనీ, మన భూభాగం మీద చైనా నిర్మాణాలు ఏవీ లేవని ప్రకటించడం ద్వారా ప్రధాన మంత్రి సమావేశంలోని వారందరినీ (దేశంలోని వారని కూడా) ఆశ్చర్యానికి గురిచేశారు. ఈ ప్రకటనతో అనేక ప్రశ్నలు తలెత్తాయి. వాటికి జవాబు లేకపోవడంతో అనేక ఊహాగానాలు బయలుదేరాయి. భారత–చైనా సరిహద్దు సమస్యపై ప్రస్తుత యంత్రాంగం లోపల చర్చలు జరుపుతూనే మరోవైపు ఎల్ఏసిలో సరిహద్దు రేఖపై

స్పష్టతకు రావడం ద్వారా శాంతి, సామరస్యాలను నెలకొల్పడం రెండు దేశాలకూ ప్రయోజనకరం.

**కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం:** మన పార్టీనీ, కమ్యూనిస్టులనూ 'చైనా ఏజెంట్లు'గా ప్రచారం చేస్తూ ఆర్ఎస్ఎస్–బిజెపి వాళ్లు ఇతర పచ్చి మితవాద శక్తులు సోషల్ మీడియాలో తీవ్రమైన కమ్యూనిస్టు వ్యతిరేక దుష్ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాలో వారు మార్ఫింగ్ చేసిన ఫోటోలతోనూ, పచ్చి అబద్దాలతోనూ తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని రుజువైంది. ఈ కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారానికి సమాధానం చెప్పాలి.

**నేపాల్:** నేపాల్ కొత్త మ్యాపును ఆమోదిస్తూ పార్లమెంటు ఏకగ్రీవ తీర్మానం చేసింది. దాన్ని ఆ దేశ రాజ్యాంగంలో పొందుపరుస్తారు, ఇకపై అన్ని అధికారిక పత్రాల్లో ఆ మ్యాపునే ఉపయోగిస్తారు. భారత్, నేపాల్ మధ్య వివాదంలో ఉన్న కొన్ని ప్రాంతాలు కూడా ఈ మ్యాపులో ఉన్నాయి.

2020 మే 8న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, లిపులేఖ్‌తో ఉత్తరాఖండ్‌లోని దర్చులాను కలిపే వ్యూహాత్మకంగా కీలకమైన 80 కిలోమీటర్ల రహదారిని ప్రారంభించారు. ఈ రోడ్డు తమ దేశ భూభాగం గుండా వెళ్తున్నదని పేర్కొంటూ నేపాల్ తీవ్రంగా ప్రతిస్పంధించింది. వివాదాస్పదమైన లిపులేఖ్, కాలాపాని, లింపియాదురాలు నేపాల్ భూభాగాలని పేర్కొంటూ వాటిని పొందుపరుస్తూ కొత్త మ్యాపు రూపొందించింది.

2019 నవంబర్‌లో భారత దేశం కొత్త మ్యాపు తయారుచేసిన ఆరుమాసాల తరువాత నేపాల్ ఈ చర్య తీసుకున్నది.

కొన్ని సంవత్సరాల క్రితం నేపాల్‌లో కొత్త రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సందర్భంగా భారత దేశం దానిపై ఆర్థిక దిగ్బంధనం విధించిందని నేపాల్‌లోని అనేక రాజకీయ పార్టీలు అభిప్రాయపడ్డాయి. అయితే భారత ప్రభుత్వం అలాంటిదేమీ జరగలేదని పేర్కొంది. దీని తరువాత నేపాల్ ప్రజల్లో భారత వ్యతిరేకత మరింత పెరిగింది. రానురాను రెండు దేశాల మధ్య సంబంధాలు ఎంతగా దిగజారిపోయాయంటే నేపాల్ ఇప్పుడు దూరదర్శన్ వార్తా చానల్ మినహా భారత దేశానికి చెందిన అన్ని టెలివిజన్ చానళ్లను నిషేధించింది. ఇవన్నీ ఆ దేశానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాయని అది ఆరోపించింది.

నేపాల్‌లో అంతర్గత పరిణామాలు అస్థిరతకు దారితీస్తున్నాయి. ప్రధానమంత్రి కెపి ఓలి నాయకత్వంలోని నేపాల్ కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం అంతర్గత తగాదాలను ఎదుర్కొంటున్నది. ఆయనను ప్రధాని పదవి నుండి తొలగించాలని మరో సెక్షన్ కోరుతోంది. భారత దేశం తమ దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నదని ప్రధాన మంత్రి ఓలి ఆరోపిస్తున్నారు.

భారత్, నేపాల్ మధ్య సుదీర్ఘమైన బహిరంగ సరిహద్దు ఉంది. రెండు దేశాల మధ్య సంబంధాలు దిగజారిపోతే దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.

**పాకిస్తాన్:** భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఈ కాలంలో సంబంధాలు మరింత దిగజారిపోయాయి. సరిహద్దులో కాల్పుల విరమణ ఉల్లంఘనల విషయమై రెండు దేశాలు దౌత్యాధికారులను పిలించి మాట్లాడాయి. భారత్‌లోని పాకిస్తాన్ హై కమిషన్ నుండి 50 శాతం దౌత్య సిబ్బందిని తగ్గించాలని భారత దేశం ఆదేశించింది. అదేసమయంలో పాకిస్తాన్‌లోని తన హై కమిషన్ నుండి సగం మంది సిబ్బందిని వెనక్కు పిలిచింది. సరిహద్దు (ఎల్ఓసి) లోని అనేక ప్రాంతాల్లో ఈ కాల్పుల ఉల్లంఘనలు జరిగాయి. ఫిరంగి దాడులు, కాల్పులు జరిగాయి. ప్రాణ నష్టం జరిగింది. సరిహద్దుగుండా దేశంలోపలికి చొచ్చుకు వచ్చే ఘటనలు కూడా జరిగాయి. భారత సాయుధ దళాలు మిలిటెంట్లను చంపారు. జులై 6న భారత హై కమిషన్‌కు చెందిన ఒక సీనియర్ దౌత్యాధికారిని పాకిస్తాన్ పిలిపించి, భారత దేశం కాల్పుల విరమణను ఉల్లంఘిస్తున్నదని ఆరోపిస్తూ తీవ్ర నిరసన తెలిపింది. ఇందులో పాకిస్తాన్ పౌరులు చనిపోయారని, పలువురు గాయపడ్డారని ఆరోపించింది. ఈ ఏడాది భారత దేశం 1,595 సార్లు కాల్పుల విరమణను ఉల్లంఘించిందని అది ఆరోపించింది. మరోవైపు పాకిస్తాన్ కాల్పుల విరమణ ఉల్లంఘనలు ఈ ఏడాది 69 శాతం పెరిగాయని భారత దేశం పేర్కొంది. పాకిస్తాన్ 2027 సార్లు ఉల్లంఘనలు జరిపిందని తెలిపింది.

**బంగ్లాదేశ్:** పౌరసత్వ సవరణ చట్టాన్ని ఆమోదించడం, వెనువెంటనే హోమ్ మంత్రి అమిత్ షా అక్రమ బంగ్లాదేశ్ వలసదారులు అంటూ ఆ దేశానికి వ్యతిరేకంగా తీవ్రమైన వ్యాఖ్యలు చేయడంతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బ తిన్నాయి.

**ఇరాన్:** చబహర్ రైలు ప్రాజెక్టు నుండి ఇరాన్ భారత దేశాన్ని తొలగించింది. 2016లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ టెహరాన్ సందర్శించినప్పుడు ఈ ఒప్పందం కుదిరింది. భారత దేశం ఈ ప్రాజెక్టుకు నిధులు సమకూర్చే విషయంలో ఆలస్యం

చేస్తున్నదని పేర్కొంటూ ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ రైలు మార్గం వల్ల ఆఫ్ఘనిస్తాన్‌కూ, మధ్య ఆసియాకూ ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గం ఏర్పడేది. భారత దేశ ప్రాజెక్టుమీద అమెరికా ఆంక్షలు కూడా ఇది రద్దు కావడానికి ఒక కారణం అయివుండొచ్చు. గతంలో చబహార్ పోర్టులో పెట్టుబడులు పెట్టడానికి భారత దేశం అమెరికా ఆంక్షల నుండి మినహాయింపు పొందింది. కానీ ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగిన మతఘర్షణలను ఇరాన్ విదేశాంగ మంత్రి ఖండించడంతో రెండు దేశాల మధ్య సంబంధాలు దిగజారిపోయాయి.

మొత్తంగా చూసినప్పుడు శ్రీలంకతో సహా మన ఇరుగుపొరుగు దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలు కనీసంగా చెప్పాలంటే ఇటీవలి కాలంలో ఏమాత్రమూ మెరుగుపడలేదు. మరోవైపు కొన్ని దేశాలతో దిగజారిపోవడం ఆందోళనకరమైన విషయం. భారత దేశం అమెరికాతో సంబంధాలు మరింత గట్టి పరుచుకుని దానితో ఉమ్మడి సైనిక విన్యాసాలు జరపడం, 'క్వాడ్' కూటమిలో చేరడంతో చైనా మన పొరుగు దేశాల మద్దతు పొందడానికి ప్రయత్నిస్తోంది. భారత దేశం సంప్రదాయకంగా అనుసరిస్తూ వస్తున్న స్వతంత్ర, అలీన విదేశాంగ విధానానికి బిజెపి ప్రభుత్వం తిలోదకాలిచ్చింది. భారత దేశ ప్రయోజనాల రీత్యా స్వతంత్ర విదేశాంగ విధానం అనుసరించడం అవసరం.

## కేంద్ర పిలుపుల అమలు

జూన్ 16న అఖిల భారత నిరసన దినాన్ని దేశమంతటా జరపాలని పార్టీ పొలిట్ బ్యూరో ఇచ్చిన పిలుపును అన్ని పార్టీ యూనిట్లు అమలుపరిచాయి. ప్రజలు బాగా పాల్గొన్నారు. రాష్ట్రాల నుండి వచ్చిన సవివరమైన నివేదికలను కేంద్ర కమిటీ సభ్యులందరికీ సర్క్యులేట్ చేశాం గనుక ఇక్కడ మళ్లీ వివరంగా చెప్పాల్సిన అవసరం లేదు.

ఈ కాలంలో పార్టీ స్వతంత్రంగానూ, ఇతర వామపక్ష పార్టీలతో కలిసి ఉమ్మడిగానూ నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగింది. పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఇచ్చిన నిరసన కార్యక్రమాలు దేశవ్యాపితంగా విస్తృతంగా జరిగాయి.

చాలా రాష్ట్రాల్లో పార్టీ స్థానిక సమస్యలపైనా, ప్రజల సమస్యలు పరిష్కరించాలనీ, వారికి సహాయం చేయాలనీ అనేక కార్యక్రమాలు చేపట్టారు. అన్ని

ప్రజా సంఘాలకు చెందిన కామ్రేడ్స్ ఈ కార్యక్రమాల్లో పాల్గన్నారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇతర ఆరోగ్య రంగ కార్యకర్తలతో కలిసి చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. మన ప్రజా సంఘాలన్నీ స్వతంత్రగానూ, ఉమ్మడిగానూ నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. ట్రేడ్ యూనియన్లు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు జులై 3న ఇచ్చిన కార్యక్రమంలో దేశవ్యాపితంగా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గన్నాయి. ప్రభుత్వ విద్యను పరిరక్షించడం కోసం విద్యార్థి రంగం ఏర్పాటు చేసిన విస్తృత ఫ్రంటు, ఆన్‌లైన్ పరీక్షలపై యుజిసి ఇచ్చిన మార్గదర్శకాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించింది.

ట్రేడ్ యూనియన్లు, రైతు, వ్యవసాయ కార్మిక రంగాల డిమాండ్ల పరిష్కారం కోసం ఆగస్టు 9న దేశ వ్యాపిత ఆందోళనకు ఉమ్మడి పిలుపు నిచ్చారు.

కార్మిక వర్గం మిలిటెంట్ కార్యాచరణలు చేసింది. వాణిజ్య పరమైన బొగ్గు తవ్వకాల ప్రయివేటీకరణకు నిరసనగా 5.3 లక్షల మంది బొగ్గు గని కార్మికుల చారిత్రాత్మకమైన సమ్మె ఇందులో ఒకటి. కరోనా మహమ్మారి, లాక్‌డౌన్ అడ్డంకులు ఉన్నప్పటికీ ఈ సమ్మె జయప్రదంగా జరిగింది. మరికొన్ని ఇతర రంగాల్లో కూడా కార్మికవర్గం సమ్మె పోరాటాలు చేసింది. ఇంకా అనేక రంగాల్లో కార్యక్రమాలను రూపొందించారు. ఈ కాలంలో కేంద్ర ట్రేడ్‌యూనియన్లు అనేక నిరసర కార్యక్రమాలు జరిపాయి. ఆగస్టు 18న బొగ్గు పరిశ్రమలో ఉమ్మడిగా సమ్మె చేయనున్నారు.

## పొలిట్ బ్యూరో కర్తవ్యాలు

2020 జూన్ 2న జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో ఆమోదించిన ఈ క్రింది 13 కర్తవ్యాలను అమలు చేయాలి. మనం కేంద్రీకరించాల్సిన కర్తవ్యాలు:

**1) స్థానిక సమస్యలపై ఆందోళనలను బలపరచాలి:** కోవిడ్ మహమ్మారి, లాక్‌డౌన్‌ల వల్ల స్థానికంగా అనేక సమస్యలు తలెత్తాయి. జీవనోపాధి సమస్యలు, ఆహారం, ఉచిత రేషన్, ధరల పెరుగుదల, ఆరోగ్య సదుపాయాలు మొదలైన సమస్యలు ముందుకు వచ్చాయి. ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి పార్టీ, ప్రజా సంఘాలు ఈ సమస్యలపై స్థానికంగా ప్రచారం, ఆందోళన నిర్వహించాలి. భౌతిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం వంటి జాగ్రత్తలు ఖచ్చితంగా పాటిస్తూ ఆందోళనా రూపాలు ఎంచుకోవాలి. పరిస్థితి మెరుగుపడుతున్న కొద్దీ ఈ కార్యక్రమాలను దశల వారీగా పెంచుతూ పోవాలి. మెట్టుమెట్టుగా రాష్ట్ర స్థాయి, అఖిల భారత స్థాయి ఆందోళనలు చేపట్టాలి.

**2) వామపక్ష ఐక్యతను బలపరచాలి:** ఈ పరిస్థితుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు, ప్రత్యామ్నాయాలు సూచించడానికి వామపక్ష ఐక్యత నెలకొల్పడం చాలా అవసరం. దేశంలోని అన్ని స్థాయిల్లోనూ వామపక్షాలతో గట్టి సమన్వయం ఏర్పరచుకోవాలి. ఉమ్మడి కార్యక్రమాలు, కార్యాచరణలు నిర్వహించాలి.

**3) విస్తృతమైన ఉమ్మడి కార్యాచరణలు నిర్వహించాలి:** గత కొద్ది మాసాలుగా ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తి వల్ల వివిధ సెక్షన్ల ప్రజలు అప్పటికప్పుడు ఆందోళనలకు దిగే అవకాశం ఉంది. ఇటువంటి ఆందోళనల్లో పార్టీ, ప్రజా సంఘాలు చైతన్య పూర్వకంగా జోక్యం చేసుకోవాలి, చొరవ తీసుకోడానికి సిద్ధంగా ఉండాలి. ప్రజా సమస్యలపై ఆందోళనల్లో పాల్గనడానికి ముందుకు వచ్చే వారందరితోఉమ్మడి కార్యాచరణలు, కార్యక్రమాలు రూపొందించడానికి కృషి చేయాలి. ముఖ్యంగా మనం ప్రజల జీవనోపాధి, నయా-ఉదారవాద విధానాలను ఉధృతంగా అమలు చేయడానికి వ్యతిరేకంగా, ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి.. మొదలైన సమస్యలపై కృషి చేయాలి.

**4) ఆర్ఎస్ఎస్‌బిజెపికి వ్యతిరేకంగా రాజకీయ ప్రచారాన్ని ముమ్మరం చేయాలి:** మన రాజకీయ దాడి మొత్తాన్ని ఆర్ఎస్ఎస్‌బిజెపిపైనా, పైన పేర్కొన్నట్లు వాటి ఎజెండాను అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపైనా కేంద్రీకరించాలి. లాక్‌డౌన్ ఆంక్షలు సడలించిన తరువాత కూడా బహిరంగ సభలు, నిరసనలు, ఆందోళనలపై పోలీసు నిబంధనలు, అధికారిక ఆమోదాల పేరుతో నిషేధాలు కొనసాగించవచ్చు. ఆర్ఎస్ఎస్‌బిజెపి ఎజెండాను ముందుకు తీసుకుపోడానికి కార్మికులపైనా, ప్రజలపైనా నిర్బంధం కొనసాగుతుంది. మన రాజకీయ ప్రచారంలో భాగంగా వీటిని వ్యతిరేకిస్తూ ఆందోళన చేయాలి.

## పార్టీ నిర్మాణం

1) **పార్టీ కామ్రేడ్స్‌నూ, శాఖలనూ పనిలో పెట్టాలి:** పార్టీ సభ్యులు, క్యాండిడేట్ సభ్యులందరూ చురుకుగా పాల్గనేందుకూ, ప్రజలతో మన సంబంధాలు పెంచుకునేందుకు వారితో మాట్లాడాలి. శాఖలను పనిలో పెట్టాలి.

2) **కమిటీల పని:** శాఖల నుండి అన్ని స్థాయిల్లో కమిటీలను పనిలో పెట్టడం తక్షణావసరం. ఆయా ప్రాంతాల్లో ఆంక్షల నడుమనే ఈ పని చేయాలి. ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నప్పటికీ భౌతికంగా సమావేశం కావడం

సాధ్యం కాకపోతే డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి.

3) **ఆన్‌లైన్ కమ్యూనికేషన్స్ :** లాక్‌డౌన్ కాలంలో అన్ని కమిటీలు డిజిటల్–వీడియో కమ్యూనికేషన్స్‌ను ఉపయోగించుకున్నాయి. ఇటువంటి సాంకేతిక సమాచార పద్ధతుల ద్వారా పార్టీ తగినంత మంది ప్రజలను చేరుకోగలిగింది. మన సాధారణ కార్యకలాపాలతోపాటు ఇటువంటి సాంకేతిక కమ్యూనికేషన్లను కూడా ఉపయోగించుకోవాలి. పార్టీ సోషల్ మీడియాను మరింత బలోపేతం చేయాలి.

4) **నిర్మాణంలో ఇముడ్చుకోవాలి:** లాక్‌డౌన్ కాలంలో మన పార్టీ, ప్రజా సంఘాలు సహాయ కార్యక్రమాల్లో ముఖ్యమైన పాత్ర నిర్వహించాయి. ఈ సంబంధాలను పరిష్టపరుచుకోవాలి. ముఖ్యంగా వలస కార్మికులతో సంబంధాలను పటిష్టపచురుకుని వారిని నిర్మాణంలో ఇముడ్చుకోడానికి కృషి చేయాలి.

## కేంద్ర కమిటీ డిమాండ్లు

1) ఆదాయపన్ను కట్టని కుటుంబాలన్నింటికీ రానున్న ఆరుమాసాలపాటు నెలకు రూ. 7,500 చొప్పున నగదు బదిలీ చేయాలి.

2) అవసరం ఉన్న వారందరికీ ఒక్కొక్కరికీ నెలకు 10 కిలోగ్రాముల ఆహారధాన్యాలు చొప్పున రానున్న ఆరుమాసాలపాటు ఇవ్వాలి.

3) గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎంజిఎన్ రెగా) విస్తరించి, పెంచిన వేతనాలతో ఏడాదికి 200 రోజుల పని కల్పించాలి. పట్టణ ఉపాధి హామీ పథకం చట్టం తీసుకురావాలి. నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ప్రకటించాలి.

4) అంతర్రాష్ట్ర వలస కార్మికుల (ఉపాధి నియంత్రణ, సర్వీసు పరిస్థితులు) చట్టం 1979ని రద్దు చేయాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి. ఆ చట్టాన్ని మరింత బలోపేతం చేయాలి.

5) కేంద్ర ఖర్చుల్లో ప్రజారోగ్యానికి జిడిపిలో కనీసం 3 శాతం నిధులు కేటాయించాలి. ప్రాథమిక స్థాయి నుండి పైవరకు అన్ని స్థాయిల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సార్వత్రిక ఆరోగ్య పరిరక్షణను వెంటనే బలపరచాలి.

6) నిత్యావసర వస్తువుల చట్టాన్ని రద్దు చేసే ఆర్డినెన్సులను ఉపసంహరించాలి.

ఆహార ధాన్యాల ధరలపై అదుపు లేకుండా అన్ని రాష్ట్రాల మధ్య స్వేచ్ఛగా రవాణా చేసేందుకు అనుమతిచ్చే ఎపిఎంసి చట్టానికి సవరణను ఉపసంహరించుకోవాలి.

7) ఇప్పుడున్న కార్మిక చట్టాలను రద్దుచేసే, సవరించే, సస్పెండ్ చేసే ప్రతిపాదనలన్నిటినీ ఉపసంహరించుకోవాలి.

8) ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను రద్దు చేయాలి. ముఖ్యంగా భారత రైల్వేలు, విద్యుత్తు, పెట్రోలియం, బొగ్గు, బ్యాంకు ఇన్సూరెన్స్, రక్షణ ఉత్పత్తుల రంగాల్లో ప్రయివేటీకరణను రద్దు చేయాలి.

9) ప్రధాన మంత్రి పేరుతో ప్రయివేటు ట్రస్టు ద్వారా వసూలు చేసిన నిధులన్నిటినీ కరోనా మహమ్మారితో ముందుండి పోరాడుతున్న రాష్ట్రాలకు బదిలీ చేయాలి.

10) మహమ్మారిని అరికట్టేందుకు వైపరీత్యాల నిర్వహణ చట్టాన్ని ఉపయోగిస్తున్నందున కరోనా మహమ్మారి వల్ల మరణించినవారి కుటుంబాలకు జాతీయ ఉపద్రవాల సహాయ నిధి నిబంధనల కింద ఒక సారి ఆర్థిక సహాయం ప్రకటించాలి.

11) ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలు, వికలాంగులకు రిజర్వేషన్లను ఖచ్చితంగా అమలు చేయాలి. బ్యాక్‌లాగ్ పోస్టులన్నిటినీ భర్తీ చేయాలి.

12) ఫైనల్ ఇయర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుకు వారి గత సెమిస్టర్ మార్కుల ఆధారంగా మార్కులు వేసి, డిగ్రీలు ఇవ్వాలి.

13) జమ్మూకాశ్మీర్‌లో 2019 ఆగస్టు నుండి నిర్బంధించిన వారందరినీ తక్షణం విడుదల చేయాలి. కమ్యూనికేషన్లను పూర్తిగా పునరుద్ధరించి ప్రజలు స్వేచ్ఛగా తిరగడానికి అనుమతివ్వాలి.

14) యుఎపిఎ, ఎన్‌ఎస్‌ఎ, దేశద్రోహం చట్టాల కింద అరెస్టు చేసి జైల్లో పెట్టిన వారందరినీ విడుదల చేయాలి.

15) వాతావరణ ప్రభావ చట్టం 2020ని ఉపసంహరించాలి.

16) దళితులపై కుల దురహంకార దాడులకు, మహిళలపై గృహ హింసకూ, లైంగిక దాడులకూ, గిరిజనులపై దోపిడీకి పాల్పడేవారిని శిక్షించాలి.

## కేంద్ర కమిటీ పిలుపులు

1. నిబంధనలు పాటిస్తూ, జాగ్రత్తలు తీసుకుంటూనే ఈ డిమాండ్లపై ఆగస్టు 20 నుండి 26 వరకు దేశవ్యాపితంగా నిరసన వారం పాటించాలని కేంద్ర కమిటీ పార్టీ శాఖలకు పిలుపునిస్తోంది.
2. ట్రేడ్ యూనియన్లు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు 2020 ఆగస్టు 9న ఇచ్చిన నిరసన కార్యక్రమానికి కేంద్ర కమిటీ పూర్తి మద్దతు తెలియజేస్తోంది.

ప్రతులు : *2000*
ప్రచురణ కాలం : ద్వితీయ ముద్రణ సెప్టెంబరు, 2020
వెల : *₹20/-*

149825

ప్రచురణ
భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ
27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకులవారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ - 2,
ఫోన్ నెం. 0866 2577202, 9490098042